PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 200 | విజయవాడ, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 21 February 2025 | Rs

అంతా అదానీ కోసమే..

- ఏ దేశం వెళ్లినా ఆ సంస్థ ప్రయోజనాలే మోడీకి ముఖ్యం
- ఇటీవల కతార్ అమీర్ భారత పర్యటనలోనూ ఇదే సుస్పష్టం
- అంతకు ముందే ఖతార్ కంపెనీతో జాయింట్ వెంచర్‌పై సంతకం

7

గిల్.. జిగేల్



- సెంచరీతో కదం తొక్కిన శుభ్‌మన్
- షమీకి ఐదు వికెట్లు
- బంగ్లాదేశ్‌పై ఆరు వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం

6

గంట గంటకూ మోత

విద్యుత్ ఛార్జీల బాదుడు

- చిరువ్యాపారులకూ టైమ్ అప్ డే విధానం అమలు
- గృహవినియోగదారులకు మాత్రమే మినహాయింపు
- ఎపిఇఆర్‌సి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్కరణల అమలులో మరో కీలక అడుగు పడింది. ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులు ఖాళీ చేసే మరో విన్యాసానికి రాష్ట్ర సర్కారు తెరతీసింది. అదే వినియోగదారుల 'పీక్' అవర్ అవసరాలపై ఛార్జీల కత్తి పెట్టడం! తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో ఛార్జీల మోత మోగించడం! డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు హెచ్‌టి వినియోగదారులకు మాత్రమే పరిమితమైన ఈ 'టైమ్ ఆఫ్ డే ' విధానం ఇక నుంచి చిరువ్యాపారులకు కూడా అమలు కానుంది. గృహ వినియోగదారులను మాత్రం ప్రస్తుతానికి ఈ విధానం నుంచి మినహాయించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహకాలను, రాయితీలను ఇస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ విద్యుత్ సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు అదనపు రుణాలతో పాటు పలు ఇతర రాయితీలనూ ప్రకటించింది. మరోవైపు విద్యుత్ సంస్కరణలకు తానే ఆద్యుడినని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పుకుంటున్న సంగతి తెలిసిందే. సంస్కరణల బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఈ 'టైమ్ ఆఫ్ డే' లేదా 'పీక్ అవర్' ఛార్జీల మోత విధానం గృహ వినియోగదారుల తలుపు తట్టడానికి ఎక్కువ సమయం పట్టదన్న అభిప్రాయం వినపడుతోంది.

ఏప్రిల్ ఒకటి నుండి అమలు

టైమ్ ఆఫ్‌డే విధానం ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరం పీక్ అవర్ వినియోగంలో ఒక విధంగా, ఆఫ్ పీక్ అవర్‌లో మరోవిధంగా ఛార్జీలు వసూలు చేసుకోవడానికి వార్షిక ఆదాయ నివేదిక (ఎఆర్ఆర్) లో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఈ విధానానికి ఎపిఇఆర్‌సి మిగతా 7లో



టారిఫ్‌ను విడుదల చేసిన ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్

ఛార్జీల్లో ఎలాంటి మార్పులేదు : ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్

తిరుపతి సిటీ : విద్యుత్ ఛార్జీలు పెంచబోవడం లేదని, గతంలో ఉన్న ఛార్జీలో ఎలాంటి మార్పు లేదని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్(ఎపిఇఆర్‌సి) ఇన్‌చార్జి ఛైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్ తెలిపారు. తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన టారిఫ్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. మూడు డిస్కములు (ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్, ఇపిడిసిఎల్) ఏఆర్ఆర్ (మొత్తం రాబడి అవసరాలు) 58,868.52 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు ఇచ్చారని, (ఇందులో ఎస్‌పిడిసిఎల్ 22,830.44, సిపిడిసిఎల్ 12999.74, ఇపిడిసిఎల్ 23,038.34 కోట్లు). ఎపిఇఆర్‌సి 57,54.17 కోట్ల రూపాయలకు ఆమోదించిందని, రూ.1324.35 కోట్లు తిరస్కరించిందన్నారు. డిస్కంల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాశంగా ఉన్న 12,632.40 కోట్ల రూపాయలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జెన్కోల ద్వారా దిగుమతి చేసుకున్న బొగ్గులు సేకరించేందుకు ఆర్ఎస్ఆర్ (రైల్ సి రైల్) మోడ్ ద్వారా బొగ్గును రవాణా చేసేందుకు అనుమతించామన్నారు. కొత్త ఇంటి నిర్మాణం చేసుకునే వినియోగదారులకు డొమెస్టిక్ టారిఫ్ అమలు చేస్తామన్నారు. డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం మాత్రమే చెల్లించి గృహ వినియోగదారులు అదనపు లోడు తీసుకునే క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వెంకటరమణారెడ్డి, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, ఎకెవి భాస్కర్, కె సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

175 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 23న గ్రూప్ 2 మెయిన్స్ రాత పరీక్షలు జరగనున్నాయని, ఇందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షలపై సోషల్ మీడియాలో, మరెక్కడైనా వదంతులు ప్రసారం చేస్తే వెంటనే విచారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లో 175 కేంద్రాల్లో 92,250 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిఎడి ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, విద్యాశాఖ కార్యదర్శి శశిధర్, కమిషనర్ కృతికా శుక్లా, సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, ఎపిపిఎస్‌సి కార్యదర్శి ఐ.ఎన్ మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు : సిఎస్

ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్‌పిలు, సంబంధిత శాఖల అధికారులను సిఎస్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిఎస్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకూ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి మూడు నుంచి 20వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీకి సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ, 325 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 67,952 మంది హాజరుకావాల్సి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 68 సున్నితమైన కేంద్రాలు, 36 సమస్యాత్మకమైన కేంద్రాలు గుర్తించడం జరిగిందని, గత సంఘటనలు దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ కార్యదర్శి మిగతా 7లో



కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, చిత్రంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులున్నారు.

మిర్చి రైతును ఆదుకోండి

- కేంద్ర ప్రభుత్వానికి బాబు విజ్ఞప్తి
- పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తీవ్ర నష్టాల బారిన పడిన మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి దేశ రాజధానికి గురువారం వచ్చిన ఆయన పలువురు కేంద్ర మంత్రులతోనూ, ఉన్నతాధికారులతోనూ సమావేశమైనారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులతో సమావేశమయ్యారు. శివరాజ్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చంద్రబాబుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో మిర్చి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శివరాజ్‌కు వివరించారు. వారిని ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో కూడా చంద్రబాబు సమావేశమయ్యారు. భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మిర్చి ధర పడిపోయిందని చెప్పారు. ఇతర దేశాల్లో డిమాండ్ తగ్గడంతో రాష్ట్రంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు 'ఏపిలో మిరప ఎక్కువగా పండిస్తారు. దేశంలోని 50 శాతం మిరప ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తోంది. రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో మిరప సాగు జరుగుతోంది. ఈ ఏడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల మిరపను సేకరించాలి. ఇప్పటికే నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు వచ్చింది. ఎప్పుడూ లేనంతగా ధరలు ఈ ఏడాది పడిపోయాయి. గతేడాది అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ధర ఉండటంతో రైతులకు కూడా మంచి ధర వచ్చింది. అనుహ్యంగా ఈ ఏడాది ఇతర దేశాల్లో డిమాండ్ తగ్గడంతో రైతులు చాలా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఆ విషయమే మంత్రికి తెలియజేశాను.' అని చెప్పారు. మార్కెట్ ఇంట్రవన్స్ స్కీమ్ (ఎంఐఎ) కింద 25 శాతమే జోక్యం చేసుకుంటారు. అయితే ధర నిర్ణయించడానికి ఉద్దేశించిన ఐసిఎఆర్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. వాటిని సరి చేయాలని కోరాం' అని తెలిపారు. శుక్రవారం ఐసిఎఆర్ సమావేశమవుతారని చెప్పారు. నేరుగా చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందులున్నాయని, అయితే తప్పదనుకున్నప్పుడు ఏం చేయాలో తాము కూడా ఆలోచిస్తున్నామని అన్నారు. శుక్రవారం తాను కూడా ట్రేడర్స్‌తో మిగతా 7లో



సమ్మె నోటీసు ఇచ్చేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకోం

- ఉక్కునగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేత
- మార్చి7 తర్వాత ఏ క్షణమైనా నిరవధిక సమ్మెకు వెళ్లామని హెచ్చరిక

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

తమను తొలగిస్తే ఊరుకునేది లేదని ఉక్కు కాంట్రాక్టు కార్మికులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో అమీతుమీ తేల్చుకుంటామని తేల్చి చెప్పారు. కాంట్రాక్టు కార్మికులను ఎవరినీ తొలగించరాదని, ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, పాత పద్ధతిలోనే మిగతా 7లో

'వెలుగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- ఏపి రైతు సంఘం డిమాండ్

3

మేక్ ఇన్ ఇండియాకు టెస్లా తూట్లు..!

- జర్మనీ నుంచి కార్ల దిగుమతి
- భారత్‌లో విక్రయాలపైనే దృష్టి

3

ఎన్‌టిటిపిఎస్ కార్మికుడికి జిబిఎస్ వ్యాధి నిర్ధారణ

- విజయవాడ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స

2

ప్రజా వ్యతిరేకం, కార్పొరేట్ అనుకూలం

కేంద్ర బడ్జెట్‌పై విశాఖలో వామపక్షాల నిరసనలో వి శ్రీనివాసరావు, జెవి సత్యనారాయణ మూర్తి తదితరులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం), యంత్రాంగం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఇతర వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్లో రూ.60 వేల కోట్లు కోత విధించారని, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌ను తగ్గించారని వివరించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్ రాష్ట్రానికి బడ్జెట్‌లో పలు ప్రయోజనాలు కల్పించారని, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులో మధ్య తరగతికి ప్రయోజనం కలిగిస్తున్నట్లు మోసపూరితంగా బడ్జెట్లో పొందుపరిచారని తెలిపారు. వాస్తవానికి ఆదాయపు పన్నులో మధ్యతరగతి ప్రజలకు ఎటువంటి ప్రయోజనమూ కలగలేదన్నారు. అదాని, అంబాని వంటి వారికి ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్లో అనేక రాయితీలు కల్పించారని తెలిపారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా మోడీ ప్రభుత్వం వర్ణించడం పచ్చి మోసమని, ఈ బడ్జెట్ చీకటి భారత్‌ను నిర్మించేదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా వెళ్లిన ప్రధాని మోడీ భారతదేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికాకు రూ.5 లక్షల కోట్ల మేర మేలు జరిగేలా చమురు ఉత్పత్తులు, యుద్ధ విమానాల ఒప్పందాలు చేసుకున్నారని అన్నారు. అంబానిపై అమెరికాలో ఉన్న కేసును ఎత్తివేయాలని ట్రంప్‌తో ప్రధాని మోడీ మంతనాలు జరిపినట్టు వార్తలు వస్తున్నాయని గుర్తు చేశారు. జిఎస్‌టి, విద్యుత్ ఛార్జీల భారాలు వేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు. బడ్జెట్ గొప్పగా ఉందని మన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, బడ్జెట్ పరవాలేదని విశాఖపట్నం ఎంపీ భరత్ చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రానికి మేలు కలిగే విధంగా పార్లమెంట్‌లో మాట్లాడేందుకుగానీ, కేంద్రంతో పోట్లాడేందుకుగానీ మన రాష్ట్ర ఎంపీలకు దమ్ము లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. సొంత గనులు లేకుండా స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం సాధ్యం కాదని, సొంత గనుల కోసం టిడిపి కూటమి నేతలు మిగతా 7లో



విశాఖలో బడ్జెట్‌పై జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో జెవి.సత్యనారాయణమూర్తి తదితరులు

థర్మల్ ప్లాంట్ కోసం1944 ఎకరాలు

గిరిజన భూములూ సేకరణ


ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ


శ్రీకాకుళం జిల్లా బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్ కోసం భూ సేకరణకు స్కెచ్ సిద్ధమైంది. 1,944.12 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. స్థల పరిశీలనను జెన్‌కో అధికారులు మూడు పర్యాయాలు ఆ ప్రాంతంలో ఇప్పటికే పర్యటించారు. తొలుత ఈ ఏడాది జనవరి 20న బూర్జ, సరుబుజ్జిలి ప్రాంతాల్లోని పలు గ్రామాల్లోని భూములను పరిశీలించారు. రెండోసారి జనవరి 22న వెన్నెలవలసలోని మినీ రిజర్వాయర్‌ను పరిశీలించారు. తర్వాత ఈ నెల 16న సరుబుజ్జిలి మండలం చిగురువలస పంచాయతీ శ్రీరామపురంలో పర్యటించారు. థర్మల్ పవర్ ప్లాంట్‌పై డిపిఆర్‌ను సిద్ధం చేసే పనిలో జెన్‌కో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈలోగా అధికారులు పవర్ ప్లాంట్ నిర్మాణం కావాల్సిన భూములపై కసరత్తు ప్రారంభించారు. ఏ గ్రామంలో ఎంతమేర భూమి కావాల్సి ఉందో స్కెచ్ సిద్ధం చేశారు.

బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో 3,200 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు బూర్జ మండలంలో 1399.99 ఎకరాలు, సరుబుజ్జిలి మండలంలో 544.13 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. వీటిలో బూర్జ మండలం అప్పలపేట, నరేంద్రపురం, గోపిదేవిపేట, సోమదేవవలస, తిమడాం, జెవి పురం, అడ్డూరిపేట, జగన్నాథపురం, బొడ్లపాడు గ్రామాలు, సరుబుజ్జిలి మండలంలో శ్రీరామవలస, వెన్నెలవలస చిగురువలస, లక్ష్మీపురం గ్రామాలు ఉన్నాయి. బూర్జ మండలానికి సంబంధించి 149.07 ఎకరాల ప్రభుత్వ భూమి, 489.16 ఎకరాల జిరాయతీ భూమి ఉంది. వీటితోపాటు 566.27 ఎకరాల డి-పట్టా భూములు, రహదారులు, ఇతర నిర్మాణాలకు సంబంధించి 102.38 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. సరుబుజ్జిలి మండలం శ్రీరామవలసలో 75.95 ఎకరాలు, వెన్నెలవలసలో 349.74 ఎకరాలు, చిగురువలసలో 45.53 ఎకరాలు, లక్ష్మీపురంలో 72.94 ఎకరాలను గుర్తించారు.

ప్లాంట్ నిర్మాణానికి గిరిజన భూములు

గిరిజన గ్రామాలకు నష్టం వాటిల్లిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, అధికారులు చెప్తున్నా...ఆ గ్రామాల్లో సైతం భూములను సేకరిస్తున్నట్లు భూసేకరణ స్కెచ్ ద్వారా తేటతెల్లమవుతోంది. బూర్జ మండలంలో పూర్తిగా గిరిజనులే ఆవాసముండే సోమిదేవవలసలో 100.91 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అడ్డూరిపేటలోనూ గిరిజనులే ఉంటున్నారు. ఇక్కడా మిగతా 7లో





పవర్ ప్లాంట్ భూసేకరణపై అధికారులు తయారు చేసిన స్కెచ్, పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం

వంశీ బెయిల్ పిటిషన్ డిస్మిస్



ప్రజాశక్తి, అమరావతి

గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ తీర్పు చెప్పారు. 2023 ఫిబ్రవరిలో గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిన ఘటనపై పార్టీ ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెరిగిన ఆదాయం 1.20 శాతమే

- జిఎస్‌టి, మద్యం, వృత్తి పన్నుపై మాత్రం పెరుగుదల
- తగ్గిన పెట్రోల్, రిజిస్ట్రేషన్లు, గనులు, అటవీ ఆదాయం

2

కొలువుదీరిన ఢిల్లీ సర్కార్

- సిఎంగా రేఖా గుప్తా, మంత్రులుగా ఆరుగురు ప్రమాణం

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బిజెపి అగ్రనాయకులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆప్ నుంచి రాజ్యసభకు ఎంపికైన స్వాతి మలివాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. అలాగే ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులతో సహా దాదాపు 30 వేల మంది హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. పూర్తి తనిఖీల తరువాత సభస్థలికి అనుమతించారు.

రేఖా గుప్తాతో పాటు ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం సందర్భంగా రేఖా గుప్తా ఎర్రటి చీర, దానిపై జాకెట్ ధరించారు. బిజెపి మాజీ ముఖ్యమంత్రి సుష్మా స్వరాజ్‌ను గుర్తు చేసే విధంగా రేఖా గుప్తా వస్త్రధారణ చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ప్రధాని మోడీ నేతృత్వంలో ఇంపిరియల్ హోటల్‌లో జరిగిన ఎన్‌డిఎ నాయకులు సమావేశంలో రేఖా గుప్తా పాల్గొన్నారు. తరువాత సెక్రటేరియట్‌కు చేరుకుని ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం తొలి క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా బాధత్యలు స్వీకరించిన సందర్భంగా రేఖా గుప్తా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పారు. ముఖ్యంగా మార్చి 8న నాటికి అర్హత కలిగిన మహిళలందరికీ నెలకు 2,500 ఆర్థిక సహాయం అందచేస్తామని వెల్లడించారు. అలాగే ఆప్ పాలన చేసిన తప్పులకు ఆ పార్టీని బాధ్యులు చేస్తామని అన్నారు.



ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న రేఖాగుప్తా

లక్ష్మణరావుకు ఎపిటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు ఎపిటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో ప్రవేశిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, పెన్షనర్ల పక్షాన ప్రాతినిధ్యం తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ ద్వారా గతంలో కూడా బాలకృష్ణమ్మ వంటి మాజీ ఎమ్మెల్సీలు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల గొంతుకగా పనిచేశారని వివరించారు. ఈ ఒరవడి కొనసాగాలన్న, ప్రతి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటూ మండలిని వేదికగా చేసుకుని ప్రశ్నించే కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన శాసన మండలి చరిత్రను పరిశీలిస్తే పిడిఎఫ్ తరుపున గెలిచిన అభ్యర్థులు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పట్టభద్రులు, ఇతర ప్రజా సంఘాల సమస్యలను శాసన మండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యల మీద శాసన మండలిలో అనేక సందర్భాలలో ప్రస్తావించి, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, జిల్లా అభివృద్ధి సమావేశాల్లో ప్రస్తావించి, కౌలు రైతులకు అండగా నిలిచారని తెలిపారు. త్వరలో జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులైన కె.ఎస్ లక్ష్మణరావు, డివి రాఘవులు, కె.విజయగౌరీలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-గండేపల్లి (కాకినాడ జిల్లా)

పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట మండలం పెదరాయవరం గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్ర (34) యల్లమిల్లిలోని పొలాల్లో గడ్డి కోసేందుకు వెళ్లారు. గడ్డి కోసే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై సమాచారం ఇచ్చినా విద్యుత్ శాఖ సిబ్బంది ఆలస్యంగా రావడంతో రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ వైర్లు కిందకి ఉన్నాయని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని నిలదీశారు. ఈ విషయమై ఎలక్ట్రికల్ ఎఇ కిరణ్ స్పందిస్తూ ప్రమాదకరమైన వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతు మృతిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు.

పెరిగిన ఆదాయం 1.20 శాతమే



- జిఎస్‌టి, మద్యం, వృత్తి పన్నుపై మాత్రం పెరుగుదల
- తగ్గిన పెట్రోల్, రిజిస్ట్రేషన్లు, గనులు, అటవీ ఆదాయం
- 'పన్నేతరం'ను పరిగణలోకి తీసుకుంటే తగ్గిన ఆదాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల నామమాత్రంగానే ఉంది. గత జనవరి కన్నా, ఈ ఏడాది జనవరికి కేవలం 1.20 శాతం మాత్రమే పెరుగుదల నమోదైంది. పన్నులు, పన్నేతర ఆదాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటే గత ఏడాది కన్నా 0.39 శాతం తక్కువగా ఆదాయం వచ్చినట్లు తేలింది. ఈ మేరకు ఆర్థికశాఖ రూపొందించిన గణాంకాలు చర్చనీయాంశంగా మారాయి. 2024 జనవరి వరకు వచ్చిన ఆదాయం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 జనవరి వరకు వచ్చిన ఆదాయంపై ఆర్థికశాఖ నివేదికలు సిద్ధంచేసింది. దీని ప్రకారం గత జనవరి వరకు సొంత పన్నుల ద్వారా 67,993 కోట్లు సమకూరగా, ఈ ఏడాది జనవరి వరకు రు. 68,807 కోట్లు ఖజానాకు చేరింది. అంటే కేవలం 1.20 శాతం మాత్రమే పెరుగుదల ఉన్నట్లు తేలింది. ఇందులో జిఎస్‌టి, వృత్తి పన్ను, మద్యంపై ఆదాయంలలో మాత్రమే పెరుగుదల నమోదైంది. జిఎస్‌టి ఆదాయం గత ఏడాది ఉన్న 25,834 కోట్ల నుంచి ఈ ఏడాది 3.69 శాతంతో 26,789 కోట్లకు పెరిగింది. మొత్తం వాణిజ్య పన్నుల ఆదాయాన్ని పరిశీలిస్తే 0.09 శాతం తక్కువగా నమోదైంది. మద్యం ఆదాయం విభాగంలో గతేడాది జనవరి కన్నా ఈ ఏడాది జనవరి నాటికి 14.74 శాతం ఎక్కువ ఆదాయం నమోదుకాగా, అందులో ఎక్సైజ్ డ్యూటీ 23.83 శాతం ఎక్కువ వచ్చింది. ప్రత్యేక మార్జిన్ మాత్రం 2.29 శాతం తక్కువ రికార్డయింది. ఇక మిగిలిన స్టాంపులు రిజిస్ట్రేషన్లు విభాగంలో 7.43 శాతం, వాహనాలపై పన్నుల రంగంలో 2.14 శాతం, ఇతర పన్నుల విభాగంలో ఏకంగా 77.47 శాతం తక్కువ ఆదాయం రికార్డయింది. ఇక పన్నేతర ఆదాయంలో భారీ తగ్గుదల నెలకొంది. ఈ విభాగంలో గతేడాది రు. 4,879 కోట్లు రాగా, ఈ ఏడాది రు. 3,916 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే ఏకంగా 19.73 శాతం తగ్గుదల కనిపించినట్టయింది. ఇందులో గనుల శాఖ నుంచి 15.67 శాతం, అటవీ శాఖ నుంచి 68.06 శాతం, ఇతర రంగాల నుంచి 21.36 శాతం తక్కువగా ఆదాయం సమకూరింది.

వార్షిక బడ్జెట్‌పై ప్రభావం

ఈ గణాంకాలు త్వరలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్ ప్రతిపాదనపై ప్రభావం చూపించనున్నట్లు ఆర్థికశాఖ భావిస్తోంది. అనుకున్న ఆదాయం రాకపోవడంతో ఆయా రంగాల్లో ప్రతిపాదనలు ఎలా పెట్టాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే గత బడ్జెట్ కన్నా కనీసం 15 శాతం ఆదాయాన్ని పెంచి చూపించాలని ఇప్పటికే అన్ని ఆదాయ వనరుల శాఖలకు ఆదేశాలు అందాయి.

విభాగం	2023-24	2024-25	వృద్ధి (%)
పన్నుల ఆదాయం	67,993	68,807	1.20
ఏ. జిఎస్‌టి	25,834	26,789	3.69
బి. పెట్రో వ్యాట్	14,241	13,368	6.13 (-)
సి. ఎక్సైజ్ వ్యాట్	821	765	6.79 (-)
డి. వృత్తి పన్ను	263	295	12.24
సి. సబ్స్యూమ్డ్ పన్నులు	261	165	36.63 (-)
ఎక్సైజ్	19,830	22,753	14.74
స్టాంపులు రిజిస్ట్రేషన్లు	7,741	7,166	7.43 (-)
వెహికల్ టాక్స్	3,878	3,795	2.14 (-)
ఇతర పన్నులు	2,029	457	77.47 (-)
గనులు	2,166	1,27	15.67 (-)
అటవీ	94	30	68.06 (-)
ఇతర నాన్ టాక్స్	2,618	2,059	21.36 (-)

జగన్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

- గవర్నర్‌కు వైసిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్ భద్రత విషయంలో కూటమి ప్రభుత్వానికి దురుద్దేశాలు ఉన్నాయని, పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గుంటూరు పర్యటనలో జగన్‌కు భద్రత కల్పించకపోవడంపై గురువారం బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, వెలంపల్లి శ్రీనివాస్, కారుమూరు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, అరుణ్‌కుమార్ గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ సిఎంకు భద్రత కల్పించాలని కోరారు. అనంతరం మీడియాతో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అంటూ పోలీసులు కుంటి సాకులు చెబుతున్నారని, కోడ్ ఉంటే విజయవాడలో సంగీత విభావరికి ఎలా భద్రత కల్పించారని ప్రశ్నించారు. టిడిపి కూటమి పాలన కక్షపూరితంగా సాగుతోందని, జగన్‌కు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే జగన్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను తొలగించారన్నారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి,. పోతుంటాయని, జగన్‌కు సెక్యూరిటీ ఇవ్వొద్దని గుంటూరు ఐజి, ఎస్‌పికి ప్రభుత్వంలో పెద్దలు సూచించినట్లు తమకు సమాచారం ఉందని అన్నారు. ఏదైనా జరిగితే దానికి ఐజి, ఎస్‌పి బాధ్యులు కారా అని ప్రశ్నించారు. కోడ్ ఉందని చెబుతున్న పోలీసులు ముందుగానే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా విచారణకు ఆదేశించాలని గవర్నర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై గవర్నర్ విచారణ జరిపిస్తామని హామీనిచ్చారని తెలిపారు.

రైతుల పరిస్థితి దయనీయం

కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అయిందని, రాష్ట్రం నుండి రైతు భరోసా ఇవ్వకపోగా కేంద్రం నుండి వచ్చింది కూడా రైతులకు ఇవ్వలేదని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా తమ హయాంలో విత్తనం నుండి విక్రయం దాకా అండగా ఉన్నామని, నేడు ఆ వ్యవస్థలనే నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల ధరలను ఎవరూ నియంత్రించే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. వీటన్నిటి వల్ల రాష్ట్ర రైతాంగం పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు.

ఎపిలో ముంబయి తరహా ప్లానింగ్

- ఎంఎంఆర్‌డిఎ అధికారులతో మంత్రి నారాయణ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతితోపాటు రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ముంబయి తరహా ప్లానింగును అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దీనిలో భాగంగా గురువారం రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు ముంబయిలో పర్యటించారు. మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో సమావేశం అయ్యారు. అక్కడి ప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్‌పాండే ఎపి బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ రోడ్లు, మెట్రోరైలు, హౌసింగ్ ప్రాజెక్టులు చేపడుతున్న అథారిటీ వివరాలను తెలుసుకున్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు రోడ్లు, రైలు ప్రాజెక్టులు, ప్లానింగ్, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలను ఎలా చేపడుతున్నదీ అధికారులు ఎపి బృందానికి వివరించారు. విదేశీ పెట్టుబడుల సహకారంతో వసతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా భూములను అభివృద్ధి చేయడం ద్వారా నిధుల సమీకరణ చేపడుతున్న తీరునూ వివరించారు. అనంతరం మంత్రి నారాయణ స్పందిస్తూ ఎంఎంఆర్‌డిఎ పరిధిలో అనుసరిస్తున్న పద్ధతులను సిఎం చంద్రబాబునాయుడుతో చర్చించి వీటిని అమలు చేయాలనే విషయంపై త్వరలోనే తుది నిర్ణయానికి వస్తామని వెల్లడించారు.

ఉన్నత విద్యను ప్రయివేటుకు కట్టబెట్టేందుకే విజన్ - 2047

- శాసన మండలిలో ఉపాధ్యాయుల వాణి వినిపించేవారు అవసరం
- పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించండి : ఎంవిఎస్ శర్మ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉన్నత విద్యను ప్రయివేటుకు కట్టబెట్టేందుకే విజన్ - 2047ను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విజన్ పేరిట రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యకు ఉరేసే కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. విజన్ 2047లో విద్యారంగంలో ప్రభుత్వ కాలేజీలు ఎన్ని ఉంటాయి ? యూనివర్సిటీలు ఎన్ని ఉంటాయి ? ఎన్ని కొత్త కోర్సులు ప్రవేశపెడతారు ? ఎన్ని రీసెర్చ్ ప్రాజెక్టులు టేకప్ చేస్తారు ? అన్న విషయాలను ప్రకటించగలిగే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా? అని ప్రశ్నించారు. విదేశీ, కార్పొరేట్ యూనివర్సిటీలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా పాఠాలు బోధించడం.. ఉన్నత విద్య మొత్తాన్ని ప్రయివేటు విద్యాసంస్థలకు కట్టబెట్టడమే విజన్ - 2047 లక్ష్యమని, దానిని ప్రశ్నిస్తారన్న భయంతోనే తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులను శాసనమండలిలో ఉండేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. విద్యా రంగానికి, విద్యాహక్కు చట్టానికి, ప్రభుత్వ విద్యకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి సాల్ట్ ఒప్పందం పేరుతో మొత్తం ప్రైమరీ విద్యను పేద, గ్రామీణ విద్యార్థులకు అందకుండా చేసి ప్రాథమిక పాఠశాలలు మూతపడే విధంగా ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకుందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఒప్పందాన్ని రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి ప్రారంభించేందుకు ఎందుకు చొరవ చూపించడంలేదని ప్రశ్నించారు. ఇటువంటి అంశాలన్నింటినీ శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తారనే పిడిఎఫ్ తరుపున ఎవరూ లేకుండా చేసేందుకు చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులంతా ఈ మర్మాన్ని గ్రహించి తమ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పాల్గొన్నారు.

సాల్ట్ పథకం రద్దుతోనే ప్రభుత్వ విద్యకు రక్షణ : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గత మూడేళ్ల క్రితం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో నాణ్యమైన విద్య ప్రపంచ స్థాయి విద్యార్థి లక్ష్యంగా చేసుకున్న ఒప్పందంలో భాగంగా వచ్చిన సాల్ట్ పథకం రాష్ట్ర ప్రభుత్వ విద్యా రంగాన్ని విచ్ఛిన్న దశకు తీసుకెళుతుందని, తక్షణమే సాల్ట్ పథకం నుంచి ప్రభుత్వం వెనక్కి రావాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. విశాఖలో యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ వన్, ఫౌండేషన్ టుతో పాటు ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సాల్ట్ పథకాన్ని గత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. దానిలో భాగంగా ఉపాధ్యాయులకు పలు రకాల శిక్షణ ఇచ్చే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. కానీ సాల్ట్ పథకం వల్ల ఒకటి, రెండు తరగతులకు మారినటువంటి పాఠశాల సంఖ్య 12 వేలకుపైగా ఉన్నాయని, ఆయాచోట్ల ఏకోపాధ్యాయ బోధనే జరుగుతుండడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం జిఒ నెంబర్ 117ను రద్దు చేసి నూతన జిఒ కోసం కసరత్తు చేస్తోందని, దీంతో మరిన్ని ఫౌండేషన్ స్కూల్స్ పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మూసివేతకు గురయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్‌రావు మాట్లాడుతూ సాల్ట్ పథకం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడితే భవిష్యత్తులో ఉన్నత పాఠశాలలు కూడా బలహీనపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, కోశాధికారి రాంబాబు, సహాధ్యక్షులు ఎన్ ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు టి అప్పారావు, కార్యదర్శులు రిజ్వన్, రాము, రియాజ్, జగన్, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి టమోటా కొనుగోలు

- రైతు బజార్లలో విక్రయం : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ నెల 21 నుంచి టమోటా కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో నేరుగా విక్రయించాలని, అవసరం మేరకు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ అంశంపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతుల నుంచి టమోటాను ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, రవాణా సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అంశంలో జెసిలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయం తగదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయాలు ఉండడం భావ్యం కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు శ్రీనివాసరావు బదులిస్తూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలతో సంబంధం లేకుండా జరగాలని అన్నారు. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం బహిరంగంగా పోటీలో ఉన్న ఒక అభ్యర్థికి మద్దతు ప్రకటించిందని తెలిపారు. అంతేకాకుండా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రత్యక్షంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం మంచిది కాదన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి ఉపాధ్యాయులు మద్దతు ఇస్తున్నారని తెలిపారు.

ఎన్‌టిటిపిఎస్ కార్మికుడికి జిబిఎస్ వ్యాధి నిర్ధారణ

- విజయవాడ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



ఇఎస్ఐ ఆస్పత్రిలో జిబిఎస్ వ్యాధి బారినపడిన వ్యక్తిని పరీక్షిస్తున్న ఇఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని నార్ల తాతారావు ధర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్) కార్మికుడు కె.జార్జి.. గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జిబిఎస్) వ్యాధి బారినపడ్డారు. ఈ వ్యాధి లక్షణాలతో విజయవాడ గుణదలలోని ఇఎస్ఐ ఆస్పత్రిలోని అత్యవసర విభాగానికి వచ్చారు. వైద్య సిబ్బంది పరీక్షించి వెంటనే విజయవాడలోని ఆంధ్రా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా జిబిఎస్ వ్యాధి బారిన పడినట్లు ధ్రువీకరించారు. దీంతో ఇఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి వెంటనే కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితోపాటు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక శాఖ డైరెక్టర్ వి.ఆంజనేయులు ఆదేశాల మేరకు వ్యాధి నివారణ మందులను బాధితుడి కుటుంబానికి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు ఇఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి తెలిపారు. లక్షలాది రూపాయల విలువైన ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్లను బాధితుడికి సకాలంలో అందించగలిగామని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహించే వైద్యులపై వేటు

- ప్రతి జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ డిస్పెన్సరీ
- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇఎస్ఐ లక్ష్యానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వైద్యులు, సిబ్బందిని ఏ మాత్రమూ ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఇఎస్ఐ డిస్పెన్సరీ పెట్టే యోచనలో తమ ప్రభుత్వం ఉందన్నారు. రాజమండ్రిలో వైద్యుల నిర్లక్ష్యాన్ని గుర్తించిన తరువాతే సస్పెండ్ చేశామని అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... రోగులు, విధుల పట్ల వారు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. అక్కడ ఓపి 50 కూడా లేదని, వైద్యులను సస్పెండ్ చేసిన తరువాత 170కి పెరిగిందనే విషయాన్ని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇఎస్ఐ ఆస్పత్రులను పూర్తిగా నిర్లక్ష్యంగా చేసిందని, కాకినాడ ఆస్పత్రిని కేంద్రానికి అప్పగించిందన్నారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం 78 డిస్పెన్సరీలకు అదనంగా మరో 18 మంజూరు చేస్తుందని వివరించారు. ఏడాది కాలంలో ఐపి హోల్డర్లను 30 లక్షలకు పెంచాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తొమ్మిది మాసాల వ్యవధిలోనే తమ ప్రభుత్వం అమరావతిలో ఇఎస్ఐ సెకండరీ కేర్ ఆస్పత్రి, 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదను ఇఎస్ఐ కార్పొరేషన్‌కు పంపించినట్లు తెలిపారు. దీనివల్ల 97 రెగ్యులర్ పోస్టులు, 94 అవుట్‌సోర్సింగ్ పోస్టులు మంజూరు చేసినట్లు వివరించారు. విశాఖ ఫార్మాసిటీలో సిఎస్ఆర్ నిధులతో మొబైల్ ఐసి యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో ఇఎస్ఐ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

'వెలిగొండ'కు మరో రెండేళ్లు

- పూర్తి చేయకుండానే గత ప్రభుత్వం జాతికి అంకితం చేసింది
- మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే దాదాపు రూ. నాలుగు వేల కోట్ల నిధులతో పాటు రెండేళ్ల సమయం పడుతుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన పనులేవీ పూర్తి చేయకుండానే రైతులను గృహ నిర్బంధం చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని చెప్పారు. శ్రీశైలం వద్ద నుండి హెడ్ రెగ్యులేటర్, రిటైనింగ్ వాల్ పనులు మొదటి, రెండో సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులు, నిర్వాసితుల కాలనీ పనులు పూర్తి చేయలేదని అన్నారు. ఒకటో సొరంగంలో 1.20 లక్షల క్యూబిక్ మీటర్లు, రెండో సొరంగంలో రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందన్నారు. దీనికి దాదాపు తొమ్మిది నెలలు పడుతుందని పేర్కొన్నారు. రెండో సొరంగంలో ఇంకా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. 6.8 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేయాల్సి ఉందని తెలిపారు. భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా ఉందని, దాన్ని తొలగించేందుకు సమయం పడుతుందని పేర్కొన్నారు. 21.8 కిలోమీటర్ల మేర ఫీడర్ కెనాల్‌నూ నిర్మించాలని చెప్పారు. ఇన్ని పనులూ పెండింగ్‌లో ఉంటే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వంపై బురద జల్లే విధంగా వైసిపి నాయకులు మాట్లాడటం సరికాదని తెలిపారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని, రూ.1373 కోట్లను కేటాయించి రూ.1319 కోట్లను వెచ్చించి 30 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీస్థాయిలో రూ.3518 కోట్లు బడ్జెట్ కేటాయిస్తున్నట్లు చూపించినప్పటికీ అందులో 18 శాతం నిధులు అంటే రూ.647 కోట్లను మాత్రమే వెచ్చించారన్నారు.



పోలీసు డ్యూటీ మీట్‌లో ఆంధ్ర ఉత్తమ ప్రతిభ

- పోలీసులకు డిజిపి అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులను డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. జార్ఖండ్ రాజధాని రాంచిలో ఆరు రోజుల పాటు 68వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో సత్తా చాటి నాలుగు స్వర్ణపతకాలు, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు సాధించడంతో పాటు టీం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాల పట్టికలో ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సాధించిన రికార్డ్ సృష్టించిన ఎస్ఐ కె.కృష్ణమూర్తికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు చెందిన 24 టీమ్‌లు పాల్గొనగా, డిఐజి కె.కె.ఎస్ అంబురాజన్ నేతృత్వంలోని అధికారులతో కూడిన బృందం పాల్గొందని తెలిపారు.

ఐదుగురు బాలికల అదృశ్యం...

- పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

ఐదుగురు బాలికలు అదృశ్యమైన సంఘటన కృష్ణాజిల్లాలో గురువారం సంచలనం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు ఈ బాలికలను మాయమాటలతో నమ్మించి హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారని తెలుస్తోంది. పోలీసులు వెంటనే స్పందించడంతో బాలికలను పట్టుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్‌కు చెందిన నలుగురు బాలికలు చుట్టుగుంట చైతన్య కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆ నలుగురికి స్నేహితురాలైన మాచవరానికి చెందిన వేరొక బాలికతో కలిసి వారు హైదరాబాద్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు హైదరాబాదులో పరీక్ష రాసేందుకు వెళుతున్నట్లుగా నమ్మ పలికారు. అయితే ఒక బాలిక ఇంట్లో చెప్పకుండా అర్ధరాత్రి రెండు గంటలకు బయటకు వెళ్లిపోయింది. ఆ విషయాన్ని గమనించిన ఇంట్లోని వారు భయపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గన్నవరం సిఐ శివప్రసాద్ బాలికల తల్లిదండ్రులను విచారించారు. విచారణలో ఫోన్ ద్వారా ట్రేస్ చేసి వారు హైదరాబాద్ వెళ్లే ట్రైన్లో ఉన్నట్లుగా తెలుసుకొని సత్తెన్న పల్లి ఏరియాలోని పోలీసులను అలెర్ట్ చేశారు. అక్కడ వారు ట్రైన్లో ఉన్న బాలికలను పట్టుకున్నారు. హైదరాబాదులో పరీక్ష రాయడానికి వెళుతున్నట్లుగా ఆ బాలికలు చెబుతున్నారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి ఇంటి నుంచి బయలుదేరి విజయవాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఇద్దరు వ్యక్తులు వారిని హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్ ఎక్కించారు. పోలీసులు వేగంగా స్పందించడంతో ఐదుగురు బాలికలు సేఫ్‌గా బయటపడ్డారు. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకొని తమ పిల్లలను కాపాడినందుకు తల్లిదండ్రులు పోలీసులకు అభినందనలు తెలియజేశారు. ఒక ముఠా పథకం ప్రకారం ఈ బాలికలను హైదరాబాద్ తీసుకువెళ్లి అక్కడ నుంచి ముంబయికి తరలించేందుకు కథ నడిపిందనే ప్రచారం కజరుగుతుంది.

నియంత్రణ చర్యలు పాటించాలి

- కేంద్ర పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ బాంబేలే



పౌల్ట్రీల నిర్వాహకులతో సమావేశమైన కేంద్ర బృందం

ప్రజాశక్తి - తణుకు రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

పౌల్ట్రీ రైతులు బర్డ్‌ఫ్లూ వైరస్ నియంత్రణ చర్యలు సక్రమంగా పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తిని త్వరితగతిన అరికట్టవచ్చని కేంద్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ బాంబేలే అన్నారు. వైరస్ గుర్తించిన పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం వేల్పూరు గ్రామంలో ఉన్న కృష్ణానందం పౌల్ట్రీని ఆయన గురువారం సందర్శించారు. వ్యాధి వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలు, కోళ్లను పూడ్చిపెట్టిన విధానంపై ఆయన వెంట వచ్చిన కేంద్ర శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అనంతరం తణుకులోని చిట్టూరి హెరిటేజ్ హోటల్లో పౌల్ట్రీ రైతులు, పశువైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాంబేలే మాట్లాడుతూ.. వైరస్ ప్రయాణిస్తున్న తీరు తెలియదు కాబట్టి వైరస్ సోకిన ఫారం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో రెడ్ జోన్, 10 కిలో మీటర్ల పరిధిలో సర్వేలన్స్ జోన్‌గా పరిగణిస్తున్నామని తెలిపారు. రెడ్ జోన్ ప్రకటించిన ప్రాంతంలో అన్ని కోళ్లను ఖననం చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి పౌల్ట్రీ రైతు బయో సెక్యూరిటీ పాటించడం ద్వారానే ఇటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా చూసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ కోళ్లఫారాల్లో వ్యాక్సినేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేస్తుందని, కమిటీ ఇచ్చిన సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడుతుందన్నారు. ప్రతియేటా అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో వైరస్ వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ ఉంటాయని, రైతులు ఆ కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నెక్ చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ.. పౌల్ట్రీ ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.400 కోట్లు జిఎస్‌టి వస్తోందన్నారు. వైరస్ సోకిన ఫారాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోయినట్లు ప్రచారం జరిగిందని, దీనివల్ల రైతులు నష్టాలు చవి చూడాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం పౌల్ట్రీ ఉత్పత్తులపై విధించిన ఆంక్షలను వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ డిసీజ్ డైగ్నోజ్ ల్యాబ్ జాయింట్ డైరెక్టర్ రవీంద్ర హెగ్డే, సీనియర్ శాస్త్రవేతలు ఎమ్‌డిఎం.చందా, మనోజ్ కుమార్, ఎన్‌టిఆర్ వెటర్నరీ సైన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెవి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వివేకా పిఎ కృష్ణారెడ్డి ఆరోపణల్లో నిజం లేదు

- కోర్టుకు నివేదిక ఇచ్చిన పులివెందుల డిఎస్‌పి

ప్రజాశక్తి–పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలంటూ బలవంతం చేస్తున్నారని పిఎ కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజంలేదని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ కోర్టుకు నివేదిక సమర్పించినట్లు సమాచారం. వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సిబిఐ ఎస్‌పి రామ్‌సింగ్‌లు కలిసి అప్రూవర్ దస్తగిరి మాదిరి సాక్ష్యం చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారని కోర్టును కృష్ణారెడ్డి ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ కేసు వారిపై పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దీనిపై కృష్ణారెడ్డి తెలిపిన పది మంది సాక్షులను పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో వారిచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని డిఎస్‌పి మురళీ నాయక్ పరిశీలించి కృష్ణారెడ్డి ఫిర్యాదులోని ఆరోపణలు నిరాధారమైనవని కోర్టుకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వైఎస్ సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి గురువారం పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్‌ను కలిశారు. కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు గురించి డిఎస్‌పితో చర్చించారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

- రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి

ప్రజాశక్తి–పుట్టపర్తి రూరల్

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియా తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో రీ సర్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. జగరాజుపల్లి గ్రామాన్ని ఈ సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆ గ్రామంలో పర్యటించి సర్వేనెంబర్ 73, బ్లాక్ నెంబర్ 3లోని 200 ఎకరాల భూమి సర్వే ప్రక్రియను కలెక్టర్ టిఎస్ చేతన్‌తో కలిసి పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించి రైతు చిన్నపరెడ్డి భూమి పరిధిలో 15 మంది రైతులు కలిసి ఉన్నారని కార్యదర్శికి మండల రెవెన్యూ అధికారులు వివరించారు. రీసర్వే అనంతరం రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శితో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. పొలాల హద్దులను సరిచూసుకునేందుకు కాక, అన్నదమ్ములు, ఇతరుల మధ్య ఉన్న భూ సమస్యలు సైతం నివృత్తి చేసుకోవచ్చని, భూ హక్కు ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్‌డిఓ సువర్ణ, ఎడి సర్వేయర్ పి విజయశాంతి బాయి, రైతులు పాల్గొన్నారు.

'వెలుగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి–పోరుమామిళ్ల (వైఎస్ఆర్ జిల్లా)



పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించి పూర్తి చేయాలని, పోరుమామిళ్ల, కలసపాడు రైతాంగాన్ని ఆదుకోవాలి డిమాండ్ చేస్తూ రైతులు గురువారం వైఎస్ఆర్ జిల్లా పోరుమామిళ్ల ఆర్‌టిసి బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ర్యాలీని ఉద్దేశించి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1996లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఇప్పటికి 30 సంవత్సరాలు కావస్తోందని, ఇంతవరకు ప్రాజెక్ట్ పూర్తి చేయలేదని తెలిపారు. శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాలుగుసార్లు సిఎంగా గెలిచి కూడా వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ.400 కోట్ల అంచనా వేసి 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, 20 లక్షల మందికి తాగునీరు అందిస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ఇప్పటికీ చెంబుడు నీళ్లు కూడా అందించలేకపోయారని అన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంత వాసుల వలసలు ఆగిపోయేవని తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ బాధితులను చూసి అధికారంలోకి వస్తే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి తాగు, సాగుకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టి అందులో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 24న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. పొదిలి, యర్రగొండపాలెం, దోర్నాల, బేస్తవారిపేట, పెద్దారవీడు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, పిసిపల్లి, సిఎస్‌పురం, పామూరు, కనిగిరిలో నిరసనలు తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు.

బోర్డు మెంబర్ నరేష్‌కుమార్‌ను తొలగించాల్సిందే

- పరిపాలనా భవనం ఎదుట టిటిడి ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన
- అధికారులతో చర్చలు విఫలం


టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులతో అధికారుల చర్చలు

ప్రజాశక్తి – తిరుపతి సిటి

టిటిడి ఉద్యోగి బాలాజీపై దురుసుగా ప్రవర్తించిన బోర్డు మెంబర్ నరేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. పరిపాలనా భవనం ఎదుట టిటిడి ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామికి సేవ చేసేందుకు టిటిడి బోర్డులోకి వచ్చిన వ్యక్తులు టిటిడి ఉద్యోగులపై పెత్తనం చేయాలనుకోవడం సరైనది కాదన్నారు. శ్రీవారి దర్శనం చేసుకుని బయటకు వస్తున్న బోర్డు మెంబర్ నరేష్ కుమార్ మహాద్వారం ముందు విచక్షణ కోల్పోయి, ఆగ్రహంతో ఊగిపోవడం శోచనీయమన్నారు. స్వామివారిని దర్శించుకున్న నిమిషాల వ్యవధిలోనే ప్రశాంతతను కోల్పోయి వ్యవహరించడం విడ్డూరంగా ఉందని, ఇలాంటివారు బోర్డులో ఉంటే శ్రీవారికి ఎలా సేవ చేయగలరని ప్రశ్నించారు. ఇటీవల బోర్డు సభ్యుల తీరు ఆక్షేపణీయంగా ఉందని, దీన్ని ప్రశ్నిస్తున్న ఉద్యోగులకు రాజకీయాలను అంట కట్టడం బాధాకరమన్నారు. ఇక్కడ ఉద్యోగులు వ్యక్తిత్వం లేని వాళ్లు కాదని, రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉద్యోగులకు లేదని తెలిపారు. జరిగిన తప్పులు సరిదిద్ది శిక్షించాల్సిన వారు, దీనిపై స్పందించకుండా నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నరేష్ కుమార్ వెంటనే ఉద్యోగికి క్షమాపణ చెప్పాలని, బోర్డు మెంబర్ పదవి నుంచి అతనిని తొలగించాలని డిమాండ్ చేశారు. టిటిడి ఉద్యోగులు ప్రధాన ద్వారం వద్ద భారీ స్థాయిలో నిరసన వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి, ఉద్యోగులను చర్చలకు ఆహ్వానించారు.

రెండు రోజులపాటు మౌన ప్రదర్శనలు

టిటిడి ఉద్యోగులతో అధికారులు చర్చలు జరిపారు. బోర్డు చైర్మన్ తరపున సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి, టిటిడి ఇఒ కార్యనిర్వహణాధికారి తరపున అడిషనల్ ఇఒ వెంకయ్య చౌదరి, ఉద్యోగుల జెఎసి నాయకులతో సుమారు గంట పైగా చర్చలు జరిపారు. ఘటనపై విచారణ జరుపుతామని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, అంతవరకు సమన్వయం పాటించాలని కోరారు. కనీసం క్షమాపణ కూడా చెప్పకపోవడాన్ని ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. వెంటనే చర్యలు చేపట్టాలని, లేకపోతే నిరసన కొనసాగిస్తామని ఉద్యోగులు తేల్చి చెప్పారు. సమన్వయం పాటించాలని అడిషనల్ ఇఒ కోరడంతో ఉద్యోగులు రెండు రోజులు సమయం ఇచ్చారు. ఆ తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. రెండ్రోజుల పాటు మౌన ప్రదర్శనలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు జి.వెంకటేష్, ఎం.నాగర్జున, గుణశేఖర్, ప్రసాద్‌రావు, సిహెచ్.కిరణ్, ఆంజనేయులు, వెంకట రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దాసు, పద్మనాభం పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ల పరిశీలన

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు ఎనిమిది లక్షల వికలాంగుల సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ మొత్తం సంఖ్యలో 1.20 లక్షల పింఛన్ల వెరిఫికేషన్ పూర్తయినట్లు చెప్పారు. గతంలోని నియమ నిబంధనల ప్రకారమే ఈ వెరిఫికేషన్ జరుగుతుందని, అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. ఒక జోన్‌లోని వైద్యులు మరో జోన్‌లో ఈ వెరిఫికేషన్‌ను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఇల సర్వే ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటి వరకూ 50 శాతం మేర సర్వే పూర్తి అయినట్లు చెప్పారు. మార్చి 15 వరకూ సిఎం గడువు ఇచ్చారని, ఆ సమయానికల్లా పూర్తవుతుందని తెలిపారు.

కల్తీ నెయ్యి నిందితుల బెయిల్ పిటిషన్ 24కు వాయిదా

ప్రజాశక్తి – తిరుపతి బ్యూరో

తిరుమలలో కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌కు సంబంధించి వాదనలు ఈ నెల 24కు వాయిదా పడ్డాయి. కల్తీ నెయ్యి కేసులో అరెస్టు అయిన నలుగురికి ఆరోగ్యం క్షీణించిందని, వారికి బెయిల్ మంజూరు చేయాలని వారి తరపున న్యాయవాది వాణి గత సోమవారం రెండో తిరుపతి అదనపు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులు విచారణకు సహకరించలేదని, మరోసారి వారిని విచారించేందుకు అవకాశం ఇవ్వాలని మెజిస్ట్రేట్‌ను సిట్ అధికారులు కోరారు. ఈ నేపథ్యంలో గురువారం బెయిల్ పిటిషన్, సిట్ కస్టడీపై వాదోపవాదాలు జరిగాయి. ఈ నెల 24కు పడింది.



పెదవేగిలోని ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ఎదుట నినదిస్తున్న రైతులు

గ్రేడింగ్ పేరుతో ఆయిల్ పామ్ గెలల ఏరివేత తగదు

- ఆయిల్ ఫెడ్ కర్మాగారం ముందు రైతుల ఆందోళన

ప్రజాశక్తి – పెదవేగి (ఏలూరు జిల్లా)

గ్రేడింగ్ పేరుతో ఆయిల్‌పామ్ గెలల ఏరివేత ఆపాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో వద్ద గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. ఏరివేసిన గెలలతో నిరసన వ్యక్తం చేశారు. ఎపి రైతుసంఘం, ఆయిల్‌పామ్ రైతుల సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఏరివేసిన గెలలను ముందుగా రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ ధర్నానుద్దేశించి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ రికవరీ శాతం (ఒఇఆర్) పేరుతో రైతులు తెచ్చిన ఆయిల్‌పామ్ గెలలను గ్రేడింగ్ పేరుతో ఏరివేయడం అన్యాయమని అన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత మిషనరీతో ఆయిల్‌ఫెడ్ కర్మాగారం నడుస్తోందని, రికవరీ శాతం పెంచాలని ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో పక్వానికి వచ్చిన గెలలను సైతం ఏరివేయడం తగదని అన్నారు. నూతన టెక్నాలజీ మిషనరీతో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా పాత మిషనరీతో రికవరీ శాతం పెంచడం ఎట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులు గురిచేసి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ గెలలు ఏరివేత ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావుకు రైతులు, నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెదవేగి, లింగపాలెం మండలాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.



విశాఖలో దీక్షల్లో కూర్చున్న లోకో పైలట్లు

పని గంటలు తగ్గించాల్సిందే..

- లోకో పైలట్ల 36 గంటల దీక్ష

ప్రజాశక్తి – కలెక్టరేట్/సీతమ్మధార (విశాఖపట్నం)

పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో లోకో పైలట్లు 36 గంటల నిరాహార దీక్షకు దిగారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ పిలుపు మేరకు వారంతా విశాఖ దొండపర్తిలోని డిఆర్ఎం కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 8 గంటల నుంచి చేపట్టిన ఈ దీక్ష శుక్రవారం రాత్రి 8 గంటలతో ముగియనుంది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌సి పాణిగ్రహి, భోలానాథ్ మాట్లాడుతూ.. పని గంటలను ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లకు 6 గంటలు, గూడ్స్ రైళ్లకు 8 గంటల పరిమితి అమలు చేయాలని కోరారు. సాధారణంగా మొత్తం రైల్వే ఉద్యోగులకు 8 గంటల డ్యూటీ ఉంటే లోకో పైలట్ల విషయంలో మాత్రం 11 గంటల వరకూ ఉంటోందని తెలిపారు. రైలు ఆపరేషన్‌లో భద్రతను నిర్ధారించడానికి లోకో పైలట్ల డ్యూటీ సమయాన్ని తగ్గించాలని వివిధ హైపవర్ కమిటీలు సిఫార్సు చేసినా ఇప్పటికీ రైల్వే మంత్రిత్వ శాఖ పట్టించుకోలేదన్నారు. లోకో పైలట్ గూడ్స్ రైళ్లలో నిరంతరాయంగా 12 నుంచి 20 గంటలపాటు డ్యూటీ చేయాల్సి వస్తోందని తెలిపారు. లోకో పైలట్ డ్యూటీ వేళలను 8 గంటలకు తగ్గించాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సును కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వారానికోసారి తగినంత విశ్రాంతి లేకపోవడం వల్లే రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీక్షల్లో నాయకులు రాజు, ఎస్‌కె.చౌదరి, ఎం.చిన్నా పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి జగన్ పరామర్శ

ప్రజాశక్తి – పాలకొండ (పార్వతీపురం మన్యం జిల్లా)


రాజశేఖరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగన్

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో పర్యటించారు. వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాలవలస రాజశేఖరం ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శిం చారు. విశాఖ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పాలకొండ చేరుకున్న ఆయన రాజశేఖరం కుమారుడు, ఎమ్మెల్సీ విక్రాంత్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. తొలుత రాజశేఖరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జగన్‌ను చూసి ఎమ్మెల్సీ విక్రాంత్ కంట తడిపెట్టగా ఆయన్ను ఓదార్చారు. రాజశేఖర్ కుమార్తె, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో మాట్లాడారు. మీ కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజశేఖర్ లేని లోటు పార్టీకి తీరనిదని అన్నారు. జగన్ వెంట అరకు ఎంపి తనుజా రాణి, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాసు, పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్లను అభినందించిన జగన్

గంజాయి వనంలో తులసి మొక్క లాంటి వారు వైసిపి కౌన్సిలర్లు అని జగన్ అభినందించారు. ఇటీవల జరిగిన పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికల్లో ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీ ఆదేశాలకు కట్టబడి ఉండి పార్టీ ప్రతిష్ట పెంచారని ఒక్కొక్క కౌన్సిలర్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయాలి : షర్మిల

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వెళ్లే అంశంపై వైసిసి పార్టీ తమ వైఖరేంటో వెల్లడించాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వెళ్లకపోతే పార్టీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఇంట్లో కూర్చొని ప్రెస్‌మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు ఓటేసిందనే విషయాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఓ ప్రకటనలో కోరారు. ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ప్రజల సంపదను ప్యాలెస్‌కు మళ్లించుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు సిద్ధం అంటూ బయటకు వచ్చారని, ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారని, చివరికి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు.

మేక్ ఇన్ ఇండియాకు టెస్లా తూట్లు..!

- జర్మనీ నుంచి కార్ల దిగుమతి
- భారత్‌లో విక్రయాలపైనే దృష్టి

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకొంటున్న మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి టెస్లా తూట్లు పెడుతోంది. ఆ కంపెనీ జపాన్‌లో తయారు చేసిన కార్లను రెడీమేడ్‌గా తెచ్చి భారత్‌లో విక్రయించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందని రిపోర్టులు రావడమే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారు చేస్తున్న టెస్లా కంపెనీ ఇప్పట్లో భారత్‌లో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం. దిగుమతి చేసిన కార్లనే ఇక్కడ విక్రయించాలని భావిస్తోంది. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీలో తయారయిన కార్లను భారత్‌కు ఎగుమతి చేయాలని యోచన. భారత ప్రభుత్వ కొత్త ఇవి పాలసీ ప్రకారం విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి రూ.4,150 కోట్ల పెట్టుబడులకు హామీ ఇస్తే 15 శాతం సుంకం మాత్రమే విధించనుంది. దీంతో ప్రతీ ఏడాది 8,000 వాహనాలను దిగుమతి చేసుకోవడానికి వీలుంది. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. కాగా.. బెర్లిన్‌లో టెస్లా వై మోడళ్లు తయారవుతున్నాయి. వీటిని తొలుత భారత్‌కు ఎగుమతి చేయాలని యోచిస్తోంది. టెస్లా ప్లాంట్‌ను ఎలాగైన తాము దక్కించుకోవాలని గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోటాపోటీగా ఉన్నాయి. భారత్‌లో తయారీ ప్లాంట్ నెలకొల్పాలని టెస్లాకు ఓ దశలో యోచన ఉన్నప్పటికీ.. దానికి ట్రంప్ మోకాలడ్డు వేశారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని ఎలన్‌మస్క్‌తో కలిసి పాల్గొన్న ఓ కార్యక్రమంలోనే ట్రంప్ వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి సిద్ధం అవుతున్నారని.. ఇది ఆయనకు మంచిదే కావచ్చు కానీ.. అమెరికా పరంగా చూస్తే చాలా అన్యాయమేనని ట్రంప్ అనడం గమనార్హం. ఎలన్ మస్క్ ముందే ఈ వ్యాఖ్యలు చేయడంతో టెస్లా తయారీ యూనిట్‌ను భారత్‌లో నెలకొల్పడంపై నీలినీడలు కమ్ముకున్నాయని నిపుణులు భావిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయి నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు టెస్లా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందుకోసం నియామకాల కోసం ప్రకటనలు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే.



ఎపిజిబి కృష్ణానగర్ బ్రాంచి ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎండి అంజిబాబు

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి– కర్నూలు హాస్పిటల్

కడప ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామన్న ప్రభుత్వ ఆలోచనలు తక్షణమే విరమించుకోవాలని కర్నూలులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ.. 2006లో అనంత గ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంకులు విలీనమై ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఏర్పడిందని తెలిపారు. మూడు బ్యాంకులు విలీనమైన తర్వాత ఏర్పడిన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లక్షలాది డిపాజిట్లు, రూ.కోట్ల టర్నోవర్ కలిగిన బ్యాంకు కాబట్టి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరారు. అమరావతికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, యేసు, కె.ప్రభాకర్, మహమ్మద్‌రఫీ, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు, అక్బర్ దేవేంద్ర ఐటిసి హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల పట్ల కార్మిక పరిషత్ హర్షం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో 2016 జనవరి ఒకటికి ముందు మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి శేషగిరిరావు, వై.శ్రీనివాసరావులు గురువారం ప్రకటన విడుదల చేశారు.

మార్కెట్లను వీడని నష్టాలు..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. వరుసగా మూడో సెషన్ గురువారం కూడా నష్టాలను చవి చూశాయి. అమెరికా టారీఫ్‌లతో భారత్‌లో ద్రవ్యోల్బణం పెరగొచ్చనే ఆందోళనలు మార్కెట్లను ప్రతికూలతకు గురి చేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటి షేర్లలో ఒత్తిడితో బిఎస్‌ఇ సెన్సెక్స్ 203 పాయింట్ల నష్టంతో 75,736కు పడిపోయింది. నిఫ్టీ 20 పాయింట్ల నష్టంతో 22,913 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఐటిసి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఇక గూగుల్ పే బాదుడు

- కార్డ్ చెల్లింపులపై 1 శాతం రుసుం..!

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక గూగుల్ పే తన వినియోగదారులకు షాక్ ఇచ్చింది. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులతో గూగుల్ పే నుంచి చేసే చెల్లింపులపై కన్వీనియన్స్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించింది. విలువను బట్టి 0.5 నుంచి 1 శాతం వరకు ఛార్జ్ వసూలు చేయనుంది. దీంతో ముఖ్యంగా కరెంట్ బిల్లులు, గ్యాస్ బుకింగ్ చెల్లింపుల వినియోగదారులపై భారం పడనుంది. ఇతర ఫిన్‌టెక్ సంస్థలు పేటియం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తోన్నాయి. ఇప్పటి వరకు ఉచితంగా అందించిన గూగుల్ పే కూడా ఇకపై బాదుడును షురు చేసింది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ వినియోగదారుడిపై రుసం వసూలు చేసినట్లు జాతీయ మీడియాలో ఓ కథనం వచ్చింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పే వసూలు చేసినట్లు ఆ వ్యక్తి తెలిపారు. కాగా ఈ ఛార్జీలు అందరికీ వర్తిస్తాయా లేదా అనేది గూగుల్ పే స్పష్టం చేయాల్సి ఉంది. యుపిఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవని తెలుస్తోంది. గతేడాది నుంచే మొబైల్ రీఛార్జీలపై రూ.3 వసూలు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12 వేల కోట్ల యుపిఐ చెల్లింపులు నమోదయ్యాయి.

ఐపిఒ కసరత్తులో ఫోన్‌పే..!

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే ఇన్షియల్ పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రకటించింది. వాల్‌మార్ట్‌కు చెందిన ఈ సంస్థ ప్రస్తుతం 10 ఏళ్ల వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటుంది. విత్త సేవల్లో కోట్లాది మంది వినియోగదారులకు సేవలందిస్తోంది. 2023-24లో 74 శాతం వృద్ధితో రూ.5,000 కోట్ల రెవెన్యూ సాధించింది. రూ.710 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022లో ఈ సంస్థ సింగపూర్ నుంచి ఇండియాకు మారింది.

ముఖ్య ఆర్థిక సలహాదారు పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్ల పొడిగించింది. 2027 మార్చి ముగింపు వరకు ఆయన ఈ హోదాలో కొనసాగానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. 2022 జనవరి 28న సిఇఎగా తొలుత బాధ్యతలు చేపట్టారు. కేంద్రానికి వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం సిఇఎ కార్యాలయం బాధ్యత.

వడ్డీ రేట్లను తగ్గించిన పిఎన్‌బి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆర్‌బిఐ ఇటీవల రెపో రేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పిఎన్‌బి రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. సవరించిన వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి వచ్చాయని పిఎన్‌బి గురువారం వెల్లడించింది. గృహ రుణాలతో పాటు, కారు, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుందని తెలిపింది. తాజా సవరణతో పిఎన్‌బిలో గృహ రుణాల ప్రారంభ రేటు 8.15 శాతంగా ఉండనుంది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఆటోమొబైల్ రుణాలపై 8.50 శాతం, విద్యా రుణాలపై 7.85 శాతం, వ్యక్తిగత రుణాలపై 11.25శాతం నుంచి వడ్డీ రేట్లు ప్రారంభం అవుతున్నాయని పేర్కొంది. ఇటీవలే దిగ్గజ విత్త సంస్థ ఎస్‌బిఐ కూడా రుణాలపై పావు శాతం వడ్డీ రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే.

సంపాదకీయం


ఏకపక్ష నియామకం

రాజ్యాంగబద్ధ సంస్థల్లోకి తమకు తలలూపే మనుషులను జొప్పించి, వ్యవహారాలను తనకు అనుకూలంగా మార్చుకునే మంత్రాంగాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చాలా ఏళ్లుగా నడుపుతోంది. తాజాగా వివాదాస్పదం అయిన కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం ఆ తంతుకు కొనసాగింపు. ఏకపక్ష నియామకానికి అవకాశం ఇచ్చే విధంగా చట్టంలోనే మార్పు తెచ్చిన బిజెపి, దాని మీద అత్యున్నత న్యాయస్థానంలో కేసు నడుస్తుండగానే ఆగమేఘాల మీద కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ని నియమించటం అప్రజాస్వామికం. కోర్టులో వ్యాజ్యం తేలేదాకా నియామకంపై వేచి చూద్దామని ప్రతిపక్ష నేత సూచించినా, దానిని పెడ చెవిని పెట్టటం కేంద్రం ఏకపక్ష ధోరణికి నిదర్శనం.

ఇటీవల దేశంలో ఏ ఎన్నిక జరిగినా కేంద్ర ప్రభుత్వ తీరు మీదా, ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి మీదా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల వేళ సాక్షాత్తూ ప్రధానమంత్రి మోడీ విద్వేష వ్యాఖ్యలు చేసినా ఏమాత్రం చలించని ఎన్నికల సంఘం-ప్రతిపక్ష నేత చిన్న ఉల్లంఘనకు పాల్పడ్డా తీవ్రంగా స్పందించింది. మతాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రసంగాలపై సిపిఎం, ఇతర పార్టీలూ ససాక్ష్యంగా ఫిర్యాదు చేసినా, కట్టడికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో అసాధారణంగా పెద్ద సంఖ్యలో ఓటర్లు చేరటంపై అభ్యంతరాలు, అనుమానాలూ వ్యక్తం చేసినా ఎన్నికల సంఘం కిమ్మనలేదు. ఓడిన వారు చేసేవన్నీ ఆధారాలు లేని ఆరోపణలే అని కొట్టి పారేసింది తప్ప-అలాంటి అనుమానాలకు తావిచ్చిన పరిస్థితులపై కనీస పరిశీలన చేయలేదు. ఇలాంటి సంఘటనల వల్ల ఎన్నికల కమిషన్ నిబద్ధత, నిష్పాక్షికత పట్ల అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత, పారదర్శకతలపై అనుమానాలూ, ఆరోపణలూ తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయటం ఆ సంస్థల బాధ్యత. నమ్మకం సడలిపోని విధంగా ప్రవర్తించటం కేంద్ర పాలకుల కనీస నైతికత. కానీ, మోడీ ప్రభుత్వం నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న తరహాలోనే వ్యవహరిస్తోంది. ప్రతిపక్షాల మీద తిరిగి గద్దింపులకు దిగుతోంది.

చట్టసభలకు సత్తువను, ప్రజాస్వామ్యానికి విలువనూ చేకూర్చే ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగే ఎన్నికల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అన్ని పార్టీలూ, అర్హత గల వ్యక్తులూ ఎన్నికల్లో పాల్గొనటానికి భయాలూ ప్రలోభాలూ లేని పరిస్థితుల్లో పౌరులు ఓటుహక్కు వినియోగించుకోవటానికి సమాన అవకాశాల్ని కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది. ఒక పార్టీకో, అధికారానికో తలూపే గంగిరెద్దు బాపతు అధికారులతో నిష్పాక్షిక నిర్వహణ సాధ్యం కాదు. ఏ అధికార బలానికీ భయపడని, తలొగ్గని నిబద్ధులే ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలి. రాజ్యాంగబద్ధంగా అలాంటి అధికారమూ, బాధ్యత ఎన్నికల సంఘానికి దఖలు పడినప్పటికీ-దాని నిష్పాక్షికతకు, స్వేచ్ఛకు దెబ్బ కొట్టేలా మోడీ సర్కారు చట్టం తీసుకొచ్చింది. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక సిఫార్సు కమిటీలో గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండేవారు. ఆ కూర్పులో సిజెఐ స్థానే కేంద్రమంత్రిని చేర్చుతూ, బిజెపి తెచ్చిన చట్టం వివాదాస్పదం అయింది. ముగ్గురిలో ఇద్దరు అధికార పక్షానికి చెందినవారే కాబట్టి-సహజంగానే కమిషనర్ల నియామకంలో వారి మాటే చెల్లుబాటు అవుతుంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై ఆ మర్నాడే విచారణ ఉన్నప్పటికీ, బిజెపి కనీస విలువ పాటించకుండా అత్యవసర నియామకానికి దిగింది. కమిటీలో సభ్యుడిగా ఉన్న రాహుల్ గాంధీ అభిప్రాయానికి విలువ ఇవ్వకుండా మోడీ, అమిత్‌షా జోడీ సిఫార్సు చేయటం, రాష్ట్రపతి ఆమోదించటం, జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు స్వీకరించటం వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ హడావిడి తతంగంలో తమ మాట చెల్లుబాటు కావాలన్న కమలనాథుల స్వార్థం తప్ప మరొకటి కనపడదు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారం వ్యవహరిస్తే వ్యవస్థలు భ్రష్టు పడతాయి. ఇప్పటికే ప్రమాదకరంగా ఆవరించి ఉన్న మోడీ సర్కారు నిరంకుశ, అప్రజాస్వామిక ధోరణులకు అడ్డుకట్ట వేయడం ప్రజల, ప్రజాస్వామిక వాదుల కర్తవ్యం.

మంచి మాట



పెట్టుబడిదారీ విధానం తన గొయ్యిని తానే తవ్వుకుంటుంది.

-కారల్ మార్క్స్



ప్రజానుకూల దృక్పథంతో మెరుగైన విద్యా వ్యవస్థ

వ్యాఖ్య



ఇ.ఎ.ఎస్. శర్మ

వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక-2024 ఈ జనవరి 28న విడుదలైంది. దేశ వ్యాప్తంగా పౌరుల సాయంతో చేసిన ఇంటింటి సర్వే ఇది. గ్రామీణ భారతంలో విద్యార్థుల పఠన స్థాయి, బోధనా స్థాయి ఎలా ఉన్నదనే వివరాలు ఈ నివేదికలో ఉన్నాయి. దేశ పురోగతికి పునాది వంటి పాఠశాల విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు గ్రామీణ భారత దేశంలో జాతీయ స్థాయిలోనే ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా మన రాష్ట్రం విషయానికి వస్తే గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో సౌకర్యాలుగానీ, విద్యా ప్రమాణాలు కానీ జాతీయ స్థాయి సగటు కన్నా మరింత తీసికట్టుగా ఉండడం మరింతగా ఆందోళన కలిగిస్తుంది. ఆ నివేదిక నుండి కొన్ని వివరాలు (పట్టిక) మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

పట్టికలో పేర్కొన్న అంశాలను గమనిస్తే మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో విద్యార్థుల చేరిక అఖిల భారత స్థాయి కన్నా తక్కువగా ఉన్నదని స్పష్టమవుతున్నది.

అలాగే రెండవ తరగతి పాఠ్యాంశాలను చదవగలిగిన మూడవ తరగతి, ఐదవ తరగతి విద్యార్థుల శాతం చాలా తక్కువగానూ, అఖిల భారత స్థాయితో పోలిస్తే ఇంకా తక్కువగాను ఉండడం మరింత ఆందోళన కలిగిస్తున్నది.

అలాగే విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యాల అందుబాటులో కూడా మన రాష్ట్రం అఖిల భారత సగటు కన్నా తక్కువ స్థాయిలో ఉన్నది.

ఇక కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పాఠశాలల సంఖ్య, విద్యార్థులు కంప్యూటర్లను వినియోగిస్తున్న పాఠశాలల సంఖ్య కూడా అఖిల భారత సగటుతో పోలిస్తే తక్కువగా ఉన్నది.

గత కొన్నేళ్ళుగా మన రాష్ట్రంలో ఈ ప్రమాణాలు తగ్గుముఖం పట్టాయి. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో అధ్యయన ప్రమాణాలు ఇంతగా పడిపోవడానికి గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధి మీద దృష్టి పెట్టకపోవడమే కారణం. వరుసవారీ ప్రభుత్వాలు ప్రైవేటు విద్యాసంస్థల పట్ల ఉన్న మోజుతో గ్రామీణ ప్రాంత విద్యను పెంపొందించడంలో తీవ్ర అలసత్వం పాటించాయి. తగినన్ని నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించాయి. దీని మూలంగా విద్యార్జనలో మన రాష్ట్రం వెనుకబడిపోయింది. బోధనా సిబ్బంది నైతికత, విద్యార్థుల అధ్యయన ప్రమాణాలు, విద్యా ప్రమాణాలు వెనుకపట్టు పడ్డాయి.

పైన పేర్కొన్న ప్రమాణాలలో బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిషా, త్రిపుర వంటి రాష్ట్రాలు మన రాష్ట్రం కన్నా మెరుగైన స్థితిలో ఉండడం మనకు సిగ్గుచేటైన విషయం.

నూతన విద్యా విధానంలోని 26.1 పేరాలో ఈ కింది విధంగా పేర్కొన్నారు. 'పిల్లలకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం సమాజ మెరుగైన భవిష్యత్తుకు అవసరం కాబట్టి విద్యా రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెంచడానికి ఈ విధానం కట్టుబడి ఉంది. దురదృష్టవశాత్తు 1968 విద్యా విధానం, తదనంతరం సవరించిన 1986 విద్యా విధానం, ఆపై 1992లో పునరుద్ఘాటించిన విద్యా విధానాల్లో పేర్కొన్నట్లు విద్యా రంగానికి స్థూల జాతీయోత్పత్తిలో ఆరు శాతం నిధులు కేటాయించాలన్న లక్ష్యానికి ఇన్నేళ్లుగా చేరుకోలేకపోయాం. ప్రస్తుతం మన దేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి కేటాయించిన నిధులు స్థూల జాతీయోత్పత్తిలో 4.43 శాతంగా ఉన్నాయి. అలాగే ప్రభుత్వ మొత్తం వ్యయంలో విద్యా రంగ వ్యయం కేవలం 10 శాతానికే పరిమితమై ఉన్నది (ఆర్థిక సర్వే 2017-18). అభివృద్ధి చెందిన, చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే ఈ గణాంకాలు చాలా స్వల్పం'.

ప్రభుత్వ విద్యా రంగంలో పెట్టుబడులు జాతీయ స్థాయిలోనే అత్యల్పంగా ఉన్నాయి. మన రాష్ట్రంలో అయితే మరింత తక్కువగా ఉన్నాయి.

ఉదాహరణకు 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యారంగ వ్యయం 12.3 శాతం ఉన్నది. ఇది 2023-24 సంవత్సరంలో రాష్ట్రాల విద్యా రంగ వ్యయ సగటు 14.7 శాతానికన్నా చాలా తక్కువ.

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞాన చోదక అభివృద్ధి, డిజిటల్ పరిపాలన, నాలెడ్జ్ హబ్, కృత్రిమ మేధ వినియోగం పెంపుదల వంటి లక్ష్యాలు సాధించాలని నిర్దేశించుకున్నది. ఈ లక్ష్యాలు సాధించాలంటే విద్యారంగ అభివృద్ధి ముఖ్యంగా గ్రామీణ విద్యారంగ అభివృద్ధి మీద ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. లేకుంటే స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 కాగితం మీద కలగానే మిగిలిపోతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర ప్రాతిపదికన 3-5 ఏళ్ల వయసున్న పిల్లలకు ప్రీ-స్కూలింగ్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధికి అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడం, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం వంటి చర్యలకు అవసరమైన నిధులు కేటాయించాలి.

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థుల వసతి గృహాలు ఎంత దయనీయమైన పరిస్థితులలో ఉన్నాయో వివరిస్తూ గతంలోనే నేను మీకు ఒక లేఖలో తెలియజేశాను. కాబట్టి ప్రభుత్వం తక్షణం ఈ వసతి గృహాలను ఆధునీకరించే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. ప్రైవేటు విద్యా సంస్థలను ముఖ్యంగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించే వైఖరికి స్వస్తి చెప్పి ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రభుత్వ విశ్వవిద్యాల యాలను పటిష్టం చేసే చర్యలు చేపట్టి తద్వారా అల్పాదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలి. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ల నియామకంతో రాజకీయ జోక్యం లేకుండా డాక్టర్ సి.ఆర్. రెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ఉద్దండులను నియమించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. వైస్-ఛాన్సలర్ల నియామకంలో రాజకీయ జోక్యం పెరగడం మూలంగా విశ్వవిద్యాలయాల ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఏ రాష్ట్ర భవిష్యత్తు అయినా విశ్వవిద్యాలయాల బోధనా ప్రమాణాలు, బోధనా సిబ్బంది నైతికత మీద ఆధారపడి ఉంటాయి. విద్యారంగ సర్వతోముఖాభివృద్ధికి, వికాసానికిగాను బోధానా సిబ్బంది నియామకాల్లో అన్ని ప్రాంతాల వారికి, నిర్లక్ష్యానికి గురైన తరగతుల వారికి తగు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రాష్ట్రం నుండి, రాష్ట్రేతరుల నుండి విద్యారంగ నిష్ణాతులతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించి రాష్ట్రంలో ప్రీ-స్కూలింగ్ నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు మన విద్యా వ్యవస్థను ఎలా పటిష్టం చేసుకోవాలన్న విధివిధానాలను రూపొందించుకోవాలి. అలాగే ప్రీ-స్కూలింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఈ రంగంలో విశేష కృషి జరుపుతున్న ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జిఒల) సలహాలు స్వీకరించాలి. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజానుకూల దృక్పథంతో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు ముందడుగు వెయ్యాలని ఆశిస్తున్నాను.

(రాష్ట్ర విద్యా రంగ పరిస్థితులపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇటీవల రాసిన లేఖ పూర్తి పాఠం)

/ రచయిత భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి/

రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర ప్రాతిపదికన 3-5 ఏళ్ల వయసున్న పిల్లలకు ప్రీ-స్కూలింగ్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధికి అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడం, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం వంటి చర్యలకు అవసరమైన నిధులు కేటాయించాలి. ప్రభుత్వం తక్షణం వసతి గృహాలను ఆధునీకరించే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. ప్రైవేటు విద్యా సంస్థలను ముఖ్యంగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించే వైఖరికి స్వస్తి చెప్పి ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పటిష్టం చేసే చర్యలు చేపట్టి తద్వారా అల్పాదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలి.



విద్యా సూచిక	ఆంధ్రప్రదేశ్ శాతం	ధోరణి	ఆల్ ఇండియా శాతం
14 ఏళ్ల వయసు లోపు పిల్లలలో పాఠశాల చేరిక	61.8	తగ్గుముఖం	66.8
మూడవ తరగతి అధ్యయన ప్రమాణాలు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు చదవగలిగిన పిల్లలు	15.7	తగ్గుముఖం	27.0
ఐదవ తరగతి అధ్యయన ప్రమాణాలు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు చదవగలిగిన పిల్లలు	37.7	తగ్గుముఖం	48.7
ఏడవ తరగతి అధ్యయన ప్రమాణాలు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు చదవగలిగిన పిల్లలు	56.2	తగ్గుముఖం	71.1
విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని పాటిస్తున్న పాఠశాలల శాతం	62.6	నిలకడ	63.5
మంచినీళ్ళు అందుబాటులో ఉన్న పాఠశాలలు	59.8	తగ్గుముఖం	77.7
మరుగుదొడ్లు అందుబాటులో ఉన్న పాఠశాలలు	78.4	తగ్గుముఖం	79.0
ఉపాధ్యాయుల హాజరు	85.8	నిలకడ	87.3
కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పాఠశాలలు	19.2	తగ్గుముఖం	27.4
కంప్యూటర్లు అందుబాటులో ఉండి విద్యార్థులు వాడుతున్న పాఠశాలలు	9.3	నిలకడ	11.1


ఉక్రెయిన్ పట్ల స్వరం మారింది

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రాకతో ప్రపంచ దేశాల భౌగోళిక రాజకీయ సంబంధాలు పెద్ద కుదుపుకి లోనవుతున్నాయి. ఒక్కో చోట పిడుగులు, ఒక్కో చోట కుంభవృష్టి. అమెరికా తన ప్రయోజనాల్ని సాధించుకోడానికి ఏ దిశగా, ఎంత వేగంగా ప్రయత్నిస్తుందో చెప్పడం కష్టమౌతున్నది. తాజాగా ఆ దేశం వ్యూహం రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. అదీ తను ఇందాకా పక్షం వహించిన ఉక్రెయిన్ ఆశలకు విరుద్ధంగా. రష్యా, ఉక్రెయిన్ నడుమ యుద్ధం మూడేళ్లుగా కొనసాగుతోంది. బలమైన రష్యాతో, బలహీనమైన ఉక్రెయిన్ తలపడడానికి ముఖ్య కారణం తన వెనుక బలంగా నిలిచిన అమెరికా, యూరోప్ దన్ను చూసుకునే. వారి నుండి అందుతున్న ఆర్థిక, సైనిక, ఆయుధ సాయంతోనే. ఇప్పుడు అమెరికా కొత్త అధ్యక్షుడు వచ్చీ రాగానే తనని నమ్ముకుని ప్రత్యర్థి మీదకు ఎగిరెగిరి తొడగొడుతున్న పీలవాణ్ణి జెల్లకొట్టి 'తప్పు కదరా' అని తిడుతున్నాడు. పైగా అటువైపు చేరి 'ఈ యుద్ధం ముగించేద్దాం. ఏమంటావు!' అని బేరాలాడుతున్నాడు. కనీసం వీడిని గానీ, వీడి వెనక బలగాన్ని కానీ గుర్తించిందే లేదు. అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు కూర్చుని మాట్లాడుకున్నారు గానీ ఇటు వైపున్న ఉక్రెయిన్‌ని, యూరోప్‌ని పలకరించిదే లేదు. అమెరికా సాయం లేకుండా ఆ చిన్న దేశం చేసేదేమీ లేదు. ఆ లోటు మేం తీరుస్తాం అన్నంత సీను యూరోప్ దేశాలకు లేదు. కాబట్టి అమెరికా ఆంక్షలున్నప్పుడే తగ్గని రష్యా, ఇప్పుడు మరింక ఆగుతుందా! ఉక్రెయిన్ నాటోలో చేరడం మరిచిపోవడమే కాదు. కొంత నేలను కూడా రష్యాకు వదులుకోక తప్పదు. ఏదేమైనా యుద్ధం ఆగడం అందరికీ మంచిది.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

లక్ష్యాలకు దూరంగా పర్యావరణ పరిరక్షణ సదస్సులు

విమర్శ




ప్రొ॥ ఎన్.వేణుగోపాల్

ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలపై ఐక్యరాజ్యసమితి గత సంవత్సర కాలంలో నాలుగు సదస్సులు జరిపింది. అందులో ముఖ్యమైనది, నవంబర్-డిసెంబర్ (2024)లో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్-సి.ఒ.పి)-29. అది 'బాకు' నగరం (అజర్ బైజాన్)లో జరిగింది. ఈ నగరం వింతగా సముద్రమట్టం కంటే కిందనుండే ప్రదేశం. వాతావరణ తీవ్రతలకు వేగంగా గురయ్యే ప్రదేశాలలో ఇదొకటి. ఈ సమావేశాలు 2023లో జరిగిన దుబై నగర (అరబ్ ఎమిరేట్స్) కాప్-28కి కొనసాగింపుగా జరిగాయి. అదేవిధంగా 2024లో జీవ వైవిధ్యత సంరక్షణపై కొలంబియాలోనూ, భూముల ఎడారీకరణ, కరువుపై సౌదీ అరేబియాలోనూ, ప్లాస్టిక్ వాడకంపై దక్షిణ కొరియాలోను చర్చలు జరిగాయి. ఈ సదస్సులలో వివిధ దేశాల (193) ప్రభుత్వ ప్రతినిధులు, విధాన నిర్ణయ నిపుణులు, పరిశ్రమాధిపతులు, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశాల ద్వారా అనుకొన్న లక్ష్యాలు సాధించే దిశగా అన్ని దేశాలు కృషి చెయ్యాలని, వాటికి తగిన సాంకేతికాలు, ఆర్థిక దన్ను సదరు దేశాల మధ్య విస్తరించబడాలని ఐక్యరాజసమితి ప్రణాళిక రూపొందించింది.

ఈ నాలుగు సదస్సులు ఎప్పటిలాగే లక్ష్యాలకు దూరంగానే ముగిశాయి. ఈ నాలుగు అంశాలు ఒకదానికొకటి ముడిపడి వున్నాయి. జీవ వైవిధ్యతకు కలుగుతున్న సంక్షోభం పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉంది. అలాగే పర్యావరణ పరిరక్షణలో కీలకమైన సాంకేతికాల వినియోగంతో ముడిపడి వుంది. ప్లాస్టిక్ వాడిక సామాజిక అంశాలు, భూ భాగాల క్షీణత కూడా పర్యావరణ పరిరక్షణతో ముడిపడి వున్నది. వీటివల్ల వలస వాదుల పీడనకు గురైన జాతులు, వర్ధమాన దేశాలు (బీద దేశాలు) అధికంగా నష్టపోతున్నాయని అర్థమౌతూనే వుంది. ఈ సంక్షోభాలు తీవ్రమౌతూనే ఉన్నాయి. ప్రపంచం ప్రమాదపుటంచుల్లోకి నెట్టబడుతున్నదని అనుభవాలు తెలుపుతూనే ఉన్నాయి. ఈ రకమైన చర్చలు గత 35 సంవత్సరాలుగా వివిధ దేశాల్లో జరపటం ఆనవాయితీగా మారింది. ఆచరణకు నోచుకోని తీర్మానాలను రూపొందించటమూ మానటం లేదు.

గత సంవత్సరం జరిగిన ఈ నాలుగు సమావేశాల చర్చలు కూడా సమస్య పరిష్కార దిశలో లేవనే చెప్పాలి. ఒకవేళ పరిష్కారాలు సూచించినా, అవి ఆచరణకు అనుకూలమైనవని ఎక్కువ మంది భావించలేకపోతున్నారు. కారణమేంటి? ధనిక దేశాలకు, పేద దేశాలకు మధ్య ఉన్న అవసరాలు, అవకాశాలు భిన్నంగా ఉండటం ముఖ్య కారణమని తెలుస్తూనే ఉంది. అదేవిధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ధనిక దేశాలు ఆర్థిక, సాంకేతిక సహకారం అందించడంలేదు. దానికి ముఖ్య కారణం అభివృద్ధి చెందిన దేశాల మధ్య ఉన్న 'పోటీ', రాజకీయ ఎత్తుగడలు, ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలనే హస్వ దృష్టి. అలాగే పూర్తిగా కార్పొరేట్ల పరిష్వంగంలో చిక్కుకున్న ప్రభుత్వాధినేతలు.



గత సంవత్సరం జరిగిన ఈ నాలుగు సమావేశాల చర్చలు కూడా సమస్య పరిష్కార దిశలో లేవనే చెప్పాలి. ఒకవేళ పరిష్కారాలు సూచించినా, అవి ఆచరణకు అనుకూలమైనవని ఎక్కువ మంది భావించలేకపోతున్నారు. కారణమేంటి? ధనిక దేశాలకు, పేద దేశాలకు మధ్య ఉన్న అవసరాలు, అవకాశాలు భిన్నంగా ఉండటం ముఖ్య కారణమని తెలుస్తూనే ఉంది. అదేవిధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ధనిక దేశాలు ఆర్థిక, సాంకేతిక సహకారం చేయడంలేదు. దానికి ముఖ్య కారణం అభివృద్ధి చెందిన దేశాల మధ్య ఉన్న 'పోటీ', రాజకీయ ఎత్తుగడలు, ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలనే హస్వ దృష్టి. అలాగే పూర్తిగా కార్పొరేట్ల పరిష్వంగంలో చిక్కుకున్న ప్రభుత్వాధినేతలు.

కొలంబియాలో జరిగిన జీవ వైవిధ్యతను కాపాడుకొనే చర్చలు విఫలం కావటానికి మూలం, భూ వనరులను, సాంకేతికాలను వినియోగించే విధానాల పరమైన విభేదాలు. దక్షిణ కొరియాలో జరిగిన ప్లాస్టిక్ వినియోగం వల్ల వాటిల్లే ప్రమాదంపై చర్చల్లో వాణిజ్య కార్పొరేట్లకు పర్యావరణ ఉద్యమకారుల మధ్య అంతరం. అలాగే "బాకు" నగరంలో జరిగిన చర్చల్లో, పెట్రోలు ఉత్పత్తి దేశాల మధ్య, బొగ్గుపై ఆధారపడుతున్న దేశాల మధ్యనున్న విరుద్ధ అవగాహనలు, సాంకేతికాల విస్తరణకు సిద్ధపడని కార్పొరేట్ సంస్థల అభిప్రాయాలు...వెరసి సరైన తీర్మానాలకు నోచుకోలేదు.

ప్లాస్టిక్ ఎగుమతుల వల్ల ఆర్థిక లబ్ధి పొందుతున్న దేశాలు, తమకు అనుకూలమైన ప్రతిపాదలను చేశారు. అలానే శిలాజ ఇంధనాలు (పెట్రోలియం) ద్వారా ఆర్థిక వ్యవస్థను నడిపే దేశాలు వాటి నియంత్రణ విషయంలో సుముఖంగా లేవు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు కావాల్సిన ఆర్థిక సహకారమిచ్చేందుకు మిగతా దేశాలు సుముఖంగా లేవు. అనగా సాలీనా 700 బిలియన్ డాలర్ల ఖర్చుకు జీవ వైవిధ్యత వున్న బడుగు దేశాలు వెనకాడుతున్నాయి. వాతావరణ తీవ్రతల్ని అదుపులో ఉంచేందుకు కావాల్సిన 1.3 ట్రిలియన్ డాలర్ల సహాయాన్ని ధనిక దేశాలు ఇవ్వటానికి సిద్ధంగా లేవు. పైగా ప్రభుత్వేతర సంస్థలు, వ్యాపార వ్యవస్థలు (ధనిక దేశాల్లోవి) ఈ నిధిని సమకూర్చే విధంగా ప్రయత్నం చేయగలవని, అప్పటి వరకు కేవలం 300 బిలియన్ డాలర్లకు అందించగలమని ధనిక దేశాల ప్రతినిధులు చెప్పారు. ధనిక దేశాలకనుకూలంగానే తీర్మానాలు రూపొందాయి. అయినా ఆ నిర్ణయాలు ఆచరణలో అమలుకావడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

కోపెన్‌హెగెన్, డెన్మార్క్ (2009) సదస్సుల నిర్ణయం ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలు, 2020 నాటికి అభివృద్ధి చెందే దేశాలకు 100 బిలియన్ డాలర్ల నిధి సమకూర్చాలి. అయితే ఆ నిధి 2022 వరకు కూడా సమకూర్చబడలేదు. తరువాత అందించిన నిధితో అనుకున్న ప్రణాళికలను అమలు చెయ్యటంలో విఫలమైనాయి. కొనసాగింపుగా జరిగిన పారిస్ సదస్సు నిర్ణయాల అమలు అమెరికా వలన వెనకబడిపోయింది. కాప్ 28 (దుబై) ప్రకారం నిధి సమకూర్చటంలో అభివృద్ధి చెందిన దేశాల పాత్రను స్పష్టంగా తేల్చబడ్డది. ఆ సమావేశానికి అధ్యక్షుడైన సుల్తాన్ అహ్మద్ ఆల్బర్ (యు.ఎ.ఇ పారిశ్రామిక మంత్రి, అబుదాబి ఆయిల్ కంపెనీ యజమాని) తన వ్యక్తిగత పలుకుబడితో నిధికి తగిన వనరులను సమకూర్చటం మొదలెట్టాడు. ఈ నేపథ్యంలో కాప్ 29 సమావేశం 1.3 ట్రిలియన్ డాలర్ల నిధిని సమకూర్చాలని ఎక్కువ దేశాలు (భారత దేశంతో సహా) కోరాయి. ఆ నిధిని 2030 నాటికి అభివృద్ధి చెందే దేశాలకు అందించాలని తీర్మానించాయి. కాని అభివృద్ధి చెందిన దేశాలు కేవలం 300 బిలియన్ డాలర్ల నిధినే 2035 నాటికి సమకూరుస్తామని తేల్చాయి.

మరి వర్ధమాన దేశాల ఆచరణ ఎలా వుంది? దానికి ఉదాహరణగా భారతదేశ అనుభవాన్ని చూద్దాం. మాంట్రియల్ (కెనడా) సమావేశం (2009) నుండి ఈ చర్చల్లో భారతదేశం పాల్గొంటూనే ఉంది. ఆ తీర్మానంలో పేర్కొన్న "ఓజోన్ పొర రక్షణ" కార్యక్రమానికి తగిన ప్రణాళికల్ని అమలు జరుపుతామని నొక్కిచెప్పింది. అయితే అది అమలు చెయ్యటంలో చాలా దేశాల మాదిరి భారతదేశం వెనకబడ్డది. శిలాజ ఇంధనాల వాడకంలో, వ్యవసాయ రసాయనాల వినియోగంలో, క్లోరోఫ్యూరో కార్బన్లను నియంత్రించటంలో విఫలమైంది. అందుకే ఇప్పుడు 1.3 ట్రిలియన్ డాలర్ల నిధి కోసం, సంక్షోభపు అంచుల్లోకి నెట్టబడ్డ దేశాల మాదిరిగా ఎదురు చూస్తున్నది. అందులో 600 బిలియన్లు గ్రాంట్ రూపంలోనూ, టెక్నాలజీల పరంగానూ ఉండాలని కోరుతున్నది. పైగా 2026 నాటికి "భారత కార్బన్ బడ్జెట్" రూపొందుతుందని చెప్పుకొచ్చింది. అయినా మనం బొగ్గును వదల్లేం! పెట్రోలియం దిగుమతుల్ని తగ్గించలేం. ప్లాస్టిక్ వస్తువుల్ని అదుపు చెయ్యలేం. ఫ్లెక్సీలు లేకుండా బతకలేం. జీవ వైవిధ్యమున్న ప్రాంతాల్ని, ముంపు భూముల్ని రక్షించలేం. 2022-2024ల్లో సంభవించిన తుఫాన్లు, వేసవి తాపాలు మనల్ని హెచ్చరిస్తున్నా, మన లక్ష్యం వాణిజ్య కార్పొరేట్లకు రాయితీలు, ఓటర్లకు తాయిలాలు! అందుకే మనం "హిపోక్రసీ" ప్రహసనంలో ప్రముఖులం.

/ రచయిత వ్యవసాయ శాస్త్రవేత్త /

జనవ్యాక్యం

పారిశుధ్యం అధ్వానం

జిబిఎస్ వ్యాప్తిని కట్టడి చేయమని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు ఈ సిండ్రోమ్ కలుషిత నీరు, ఆహారం వల్లే వస్తున్నదని వైద్య పరీక్షల్లో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి మన రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా అధ్వానంగా ఉన్నాయి. గత సంవత్సరం విజయనగరం జిల్లాలో డయేరియా ప్రబలినప్పుడు కూడా ఇకపై తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. విజయవాడ వంటి నగరాల్లో కూడా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పరిస్థితి తీవ్రత గుర్తించి క్షేత్ర స్థాయిలో పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా.

జీవన విధానం మారాలి

ఒకప్పుడు మండే ఎండలంటే 35 డిగ్రీలు అదీ 'మే' నెలలో ఉండేవి. కానీ గత కొన్నేళ్లుగా 40 డిగ్రీలు కూడా సర్వసాధారణం అయిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులే ప్రస్తుత పరిస్థితికి కారణం. గడిచిన ఏడెనిమిది సంవత్సరాలుగా ఎండలు మండుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్, పారిశ్రామికీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అడవుల నరికివేత, కొండల తొలిచివేత, భూమిలో కలవని వ్యర్థాలతో భూ ఉపరితలం నిండిపోవడం, కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం మొదలైనవి వాతావరణంలోని మార్పులు విపత్తులకు కారణభూతాలవు తున్నాయి. ఏది ఏమైనా ప్రకృతికి అనుగుణంగా మనిషి జీవన విధానం మారకపోతే రానున్న కాలంలో మరింత విపత్కర పరిస్థితులు ఎదుర్కోవలసి ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి.

... ఆ విజయం వెనుక అమ్మ!

పరీక్షల వేళ.. పిల్లలపై ఉండే ఒత్తిడి అంతా ఇంతా కాదు. పైకి కనిపించకపోయినా తల్లిదండ్రులది కూడా అదే పరిస్థితి. ఈ వాతావరణాన్ని అనుకూలంగా మార్చుకోవడం ఎలా? పిల్లలు పరీక్షల్లో బాగా రాణించాలంటే ఏం చేయాలి? వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు ఇప్పుడు తెలుసుకుందాం. ఇటీవల జెఇఇ టాపర్‌గా ఆంధ్రప్రదేశ్ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ పేరు మార్మోగిపోవడం తెలిసిందే. తను సాధించిన ఈ విజయం వెనుక, మనోజ్ఞ తల్లి పద్మజ కృషి ఎంతో ఉంది. కూతురుపై చదువు ఒత్తిడి పడకుండా ఆ అమ్మ ఏం చేశారు? టీనేజీ కూతురుతో ఎలా నడుచుకున్నారు?


పద్మజతో చిన్నారి మనోజ్ఞ

గుంటూరుకు చెందిన మనోజ్ఞ జెఇఇలో దేశంలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన 14 మంది విద్యార్థుల్లో ఒకరు. మొత్తంగా 12.58 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. మనోజ్ఞకి లెక్కలు, కెమిస్ట్రీలో వందకి వంద మార్కులు వచ్చాయి. చదువులో చురుకుగా ఉండే మనోజ్ఞ 10వ తరగతిలో 600కి 588, ఇంటర్‌లో 470కి 466 మార్కులు తెచ్చుకుంది. తను ఈ ప్రతిభ సాధించడం వెనుక తండ్రి కిషోర్, తల్లి పద్మజ కృషి ఎంతోవుంది. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా కిషోర్, ప్రైవేట్ హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్‌గా, పోషకాహార నిపుణురాలిగా పద్మజ విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లిదండ్రులిద్దరూ తీరిక లేని పనిగంటల ఒత్తిడితో ఉన్నా కూతురు మనోజ్ఞపై ఆ ఒత్తిడి పెట్టలేదు. ఈ పరిస్థితిని తాము ఎలా అధిగమించారో పద్మజ ఇలా చెబుతున్నారు.

షరతులు పెట్టలేదు

'మనోజ్ఞ చిన్నప్పటి నుంచి ఒక లక్ష్యం ఏర్పరచుకుని చదివేది. అయితే మెయిన్ పరీక్షలప్పుడు అందరు విద్యార్థుల్లాగానే తను కూడా విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ఆ సమయంలో మేమిద్దరం తనని ఏమీ అనేవాళ్లం కాదు. గట్టిగా అరవడం, కోప్పడడం వంటివి కూడా చేసేవాళ్లం కాదు. ర్యాంకు తెచ్చుకోవాలని కూడా షరతులు పెట్టలేదు' అని చెబుతున్న పద్మజ పిల్లల చదువుల కోసం తన కెరియర్ వృద్ధిని కూడా త్యాగం చేశారు. పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేటప్పుడు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పిల్లలతో పాటు ఇంట్లోనే ఉండేవారు.

సోషల్‌మీడియా ఖాతాలు లేవు

ఈ రోజుల్లో పిల్లలు సోషల్ మీడియాకి బాగా అలవాటు పడిపోతున్నారు. ఈ పరిస్థితి గురించి కూడా పద్మజ మాట్లాడారు. 'ప్రపంచమంతా సోషల్ మీడియాలో మునిగితేలుతుంటే మా ఇంట్లోకి మాత్రం అది రాలేదు. చాలా కఠినంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. పదో తరగతి చదివేటప్పుడు మనోజ్ఞ ఇన్‌స్టా ఖాతాని ఉపయోగించేది. ఇది సరైన వయసు కాదని తనకి చెప్పాం. వెంటనే దాన్ని రద్దు చేసింది' అని చెప్పారు.

ఈ పరిస్థితిని పద్మజ ఇంకాస్త వివరంగా ఇలా చెప్పారు : 'టీనేజ్ పిల్లలున్న ఇళ్లల్లో అన్నింటికీ ఆంక్షలు పెడుతున్న తల్లిదండ్రులను పిల్లలు శత్రువులుగా చూస్తారు. మా ఇంట్లో కూడా ఆ పరిస్థితి ఎదురైంది. మనోజ్ఞ నా మాట కంటే వాళ్ల నాన్న, అన్న మాట ఎక్కువగా వినేది. ఆ పరిస్థితిని అర్థం చేసుకున్న నేను తనని తిట్టడం మానేశాను. తను చెప్పేది వినడం మొదలుపెట్టాను. క్రమంగా తన దృక్పథం నాకు తెలిసింది. ఆ తరువాత తను నా మాటలు వినడం ప్రారంభించింది. నా ఆందోళనలను అర్థం చేసుకుంది. అప్పుడు నేను మనోజ్ఞతో ఒకటే చెప్పాను. నువ్వు ఫోను ఉపయోగించుకో. అయితే దానికంటూ ఓ సమయం కేటాయించు. ఎప్పుడు ఆపాలో నువ్వే నిర్ణయించుకో. చదువుపై దృష్టి పెట్టు అని చెప్పాను' అంటున్న పద్మజ మాటలు ఎందరి తల్లులకో మార్గనిర్దేశం.

టీనేజీ పిల్లలతో ఎలా వ్యవహరించాలో పద్మజ మాటలని బట్టి అర్థం చేసుకోవచ్చు. క్రమశిక్షణ వాతావరణాన్ని సమతుల్యం చేయడం ప్రతి ఒక్క కుటుంబం ఆచరించాలి. దీనిపై పద్మజ ఇలా అంటున్నారు. 'మేము స్క్రీన్‌లపై ఎక్కువ కాలం గడిపేవాళ్లం కాదు. విరామ సమయంలో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సిద్ధపడేవాళ్లం. ఆదివారాల్లో మనోజ్ఞ 6 నుంచి 8 గంటలు చదివేది. మిగిలిన సమయంలో టీవీ చూసేది, బయటికి వెళ్లేది. విశ్రాంతి తీసుకునేది.

చదువు భారం పడకుండా ...

పిల్లలపై చదువు భారం పడకుండా ఉండాలంటే ఏం చేయాలో కూడా పద్మజ చెబుతున్నారు. 'మనోజ్ఞని ఉదయం 5 గంటలకి నిద్ర లేపేదాన్ని. ప్రశాంతమైన ఆ సయమం పిల్లల మానసిక ఆరోగ్యాన్ని చాలా ప్రభావితం చేస్తుంది. రోజంతా 12 నుంచి 14 గంటలు అధ్యయనం చేయడానికి కావాల్సిన శక్తిని ఇస్తుంది. ఒత్తిడి లేకుండా చదవమని నేను పదేపదే తనకి చెప్పేదాన్ని. ఎప్పుడైనా అలసటగా ఉంటే ఒక 10 నిమిషాలు కళ్లు మూసుకొని ప్రశాంతంగా ఉండమని అనేదాన్ని. అలాగే చేసేది.

మీ పిల్లలని వేరొకరితో పోల్చవద్దు. వారికి మద్దతు ఇవ్వండి. సరిగ్గా మార్గనిర్దేశం చేయండి. వారు ఎంచుకున్న ఏ రంగంలోనైనా రాణించనివ్వండి. మీరు మద్దతు ఇచ్చినప్పుడే, వారు మీ మాట వింటారు. మీరు వారిని డిమాండ్ చేసినా, ఆదేశించినా వారు చేయరు. జీవితంలో ఆ దశను మనం ఇప్పటికే అధిగమించాం. ఇప్పుడు పిల్లలు ఆ దశలో ఉన్నారు. విషయాలను వారి దృక్కోణం నుంచి చూడడం మొదలుపెడదాం' అని చెబుతున్న పద్మజని మనోజ్ఞని 'ఐఐటి'లో ఏ కోర్సు చదివిస్తారు? అని అడిగినప్పుడు.. తను ఏం చదువుకోవాలో తన ఇష్టం. మా ఇష్టాన్ని తనపై రుద్దం. ఆ స్వేచ్ఛ పిల్లలకి ఇవ్వాలి' అన్నారు. ఆ తల్లి మాటలు పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతి తల్లిదండ్రులు అనుసరించాలి. అప్పుడే పిల్లలు సాధించిన విజయాలు కుటుంబ విజయాలుగా మారతాయి.



ఇష్టంగా చదవమని అమ్మ చెప్పేది..

రెండు నెలల క్రితం అందరిలానే నేను కూడా పరీక్షలకి సిద్ధమయ్యాను. నా పుస్తకాల టేబుల్‌పై పుస్తకాలు ముందేసుకుని కూర్చొనేదాన్ని. ఫార్ములాస్, క్లిష్టమైన సమస్యలపై ఎన్నోసార్లు అధ్యయనం చేశాను. మాక్ టెస్టుల్లో మంచి మార్కులు వచ్చాయి. అయినా చివరి పరీక్షకి విపరీతమైన ఒత్తిడిని అనుభవించాను. అయితే అమ్మ చిన్నప్పటి నుండి ఒకటే చెప్పింది. 'ఇష్టంగా చదవమంది. కష్టం అనిపించినప్పుడు విశ్రాంతి తీసుకోమంది'. నేను అది తు.చ తప్పకుండా పాటించాను. విజయం సాధించాను.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

స్వాధీనతా ప్రకటన

... సరిహద్దులు: తూర్పు: 33అ.ల వెడల్పు రోడ్డు, దక్షిణం: 60 అ.లు వెడల్పు రోడ్డు, పడమర: ఆతరుల ఆస్తి, ఉత్తరం: ఇతరుల ఆస్తి. ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, దక్షిణం: మెట్లు, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఫ్లాట్ నం.204. దానికి అనుబంధం అన్ని ఈజిమెంటరీ/మామూలు హక్కులు మరియు ప్రస్తుత & తదుపరి, నేలకు అటాచ్‌చేయబడిన ఏవేని శాశ్వత ఫాస్టెనెడ్ లేదా నేలకు అటాచ్‌చేయబడిన అన్ని భవనాలు& నిర్మాణాలతోపాటు.

తేది: 18.02.2025 — అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ జిల్లా — ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

Paper Publication
[Substituted Service]
FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/185/2024 — **01.02.2025**

Canara Bank (e-Syndicate Bank), Behind Hindu College, Guntur Main Branch, Guntur.
Versus
M/s Ravindra Cotton Traders & others

To
(CD-1) M/s Ravindra Cotton Traders, Rep. by its Proprietor Sri. Manam Ravindranath, H No. 4-3-16, First Lane, Ramannapeta, Guntu District -522007.
(CD-2) Sri. Manam Ravindranath, S/o M. Venkateswarlu, D No. 73/1, SKR Estate, Guntur District- 522007.
(CD-3) Smt. Manam Siva Kumari, W/o M. Ravindranath, D No. 4-3-16, 1st Line, Ramannapeta, Guntur District- 522007.
(CD-4) Smt. Manam Hymavathi, W/o Sri Venkateswarlu, D No. 4-3-16, First Line, Ramannapeta, Guntur District - 522007.
(CD-5) Sri. Alapati Dhanunjaya Siva Rambabu, S/o A. Sambasiva Rao, D No. 1-34-258, 3rd Line, Satyanarayanapuram, Pattabhipuram, Guntur District- 522006.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/128/2019** an amount of **Rs. 4,77,68,611.94 Ps (Rupees four crore seventy seven lakhs sixty eight thousand six hundred eleven and ninety four paisa only)** along with the pendentallite and future interest @14.50% p.a compounded with monthly rests from 14.02.2019 till realization / date of payment and the costs become due against you (Jointly and severally Fully Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **24.02.2025** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 01st February 2025)

(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
గుంటూరు బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ -0028), 12-1-12, S V R'S ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్, శనక్కాయల ఫ్యాక్టరీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001. ఫోన్: 0863-2223997, E-Mail : iob0028@iob.in

ముందస్తు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం

తేది : 20-02-2025 — అధీకృత అధికారి
ప్రదేశం: గుంటూరు — ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం,
ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. శ్రీ పిట్టల శ్రీకాంత్, తండ్రి: బాబు, ఫ్లాట్ నెం. 510, 5వ అంతస్తు, ఎస్.కె.టి విష్ణు శ్రీనివాసం అపార్ట్‌మెంట్, గోకుల్ నగర్, మల్లాపూర్ గ్రామం, జి.హెచ్.ఎం.సి కాప్రా సర్కిల్, ఉప్పల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ-500076. **2. శ్రీ పిట్టల శ్రీకాంత్,** తండ్రి: బాబు, హెచ్.నెం.1-15ఏ, జానకిరాంపురం గ్రామం, బంటుమిల్లి మండలం-521324, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. **3. శ్రీ పిట్టల బాబు,** తండ్రి: పిట్టల పోచాలు మల్లయ్య, హెచ్.నెం.1-23/2, పొత్కపల్లి గ్రామం, ఓదెల మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ-505151. **4. దివంగత పిట్టల రాజేంద్ర ప్రసాద్ యొక్క చట్టపరమైన వారసులు,** తండ్రి: నర్సయ్య, ఫ్లాట్ నెం. 510, 5వ అంతస్తు, ఎస్.కె.టి విష్ణు శ్రీనివాసం అపార్ట్‌మెంట్, గోకుల్ నగర్, మల్లాపూర్ గ్రామం, జి.హెచ్.ఎం.సి ...

తేది: 17-02-2025 — అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు : "చోళ క్రెస్ట్", ...

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/ తాకట్టుదారులైన మీరు, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మీపై కంపెనీ చట్టపరమైన ... 13(2) క్రింద నోటీసును అక్నాలెడ్జిమెంట్ ద్వారా రిజిస్టర్డ్ ... కోరునది ఏమనగా, ఈ ప్రకరణ తేదీ నుండి 60 రోజుల ...

రుణ ఖాతా నం.	డిమాండ్ నోటీసు తేదీ	రుణ మొత్తం	బకాయి మొత్తం
1	05.02.2025	Rs. 89,00,000/-	05.02.2025, నాటికి రూ.86,81,166/-

తేది : 21.02.2025 — సం/- అధీకృత అధికారి, మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు : ఇండియన్ రాయన్ కాంపౌండు, వెరవల్, గుజరాత్-362266
కార్పొరేట్ ఆఫీసు : 12వ అంతస్తు, ఆర్ టెక్ పార్క్, నిర్లాన్ కాంప్లెక్స్, హబ్ మాల్ దగ్గర, గోరేగామ్ (ఈస్ట్), ముంబయి-400063, ఎంహెచ్.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ది రూల్స్) యొక్క రూల్ 3తో చదవగలసెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (ది చట్టం)లోని సెక్షన్ 13(2) క్రింద

క్ర.సం.	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు తేది & ఎన్‌పిఎ తేది	స్థిరాస్తి వివరణ
1.	... రుణ ఖాతా నెం. : ABVJWSTS000000639261	14.02.2025 & 02.11.2023; బకాయి మొత్తం: Rs. 35,46,201/- as on 14.02.2025	...

సం/- అధీకృత అధికారి
ప్రదేశం : క్రిష్ణా, ఆంధ్రప్రదేశ్ — ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్
తేది : 21-02-2025

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది)

ఇ-వేలం - బహిరంగమైన 15 రోజుల విక్రయ నోటీసు

క్ర.సం.	రుణగ్రహీత/సహ రుణ గ్రహీత/హామీదారుల పేరు	బకాయి మొత్తం	రిజర్వు ధర మరియు ఇఎండి	వేలం తేదీ మరియు సమయం
1.	దూపాటి శ్రీకాంత్ (రుణగ్రహీత), దూపాటి అనూష (సహ రుణగ్రహీత)	20.02.2025 నాటికి రూ.18,11,521.08/- ... ఎల్ఏఎన్ నెం. LVIJSBI0000095925 ...	రూ.18,22,500/- ...	13/03/2025, ఉ. 11 గం.ల నుండి మ. 12 గం.ల వరకు

2) ఆసక్తి కలిగిన బిడ్డర్లు తమ ఇఎండిని లబ్దిదారు సంస్థ ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థకు- DEMAND DRAFT/ NEFT/ RTGS ద్వారా చెల్లించాల్సి వుంటుంది. **లబ్దిదారుని పేరు : ఈడిల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్యాంక్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నం.: 65226845199, SARFAESI- Auction, EDELWEISS HOUSING FINANCE LIMITED, IFSC code: SBIN0001593.**
3) ఇఎమ్‌డితో సహా ఆన్‌లైన్‌లో బిడ్‌ఫారమ్ దరఖాస్తును దాఖలు చేయుటకు చివరి తేది : **12/03/2025**
4) విక్రయం యొక్క వివరమైన నియమ నిబంధనలకోసం **https://sarfaesi.auctiontiger.net** లేదా శ్రీ.మౌలిక్ శ్రీమలి ఫోన్ : **+91 6351896643/ 9173528727,** ద్వారా కానీ, హెల్ప్‌లైన్ ఇ-మెయిల్ ఐడి : **Support@auctiontiger.net** ద్వారా కానీ సంప్రదించగలరు.

మొబైల్ నెం.: 7207645328//8885462308 — సం/- అధీకృత అధికారి
తేది : 21.02.2025 — నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడినది)

IDBI BANK — ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, వుయ్యూరు బ్రాంచి

అనుబంధం-4 (రూల్ 8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ప్రదేశం: వుయ్యూరు — సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.
తేది: 20.02.2025

AXIS BANK LIMITED
రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, సిపిసి నెల్లూరు, 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జిటి రోడ్డు, నెల్లూరు-524003

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుడు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం సిపిసి నెల్లూరు, 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జిటి రోడ్డు, నెల్లూరు-524003** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర.సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1	1) బొర్ర ఏసుబాబు, తండ్రి. బి.సత్యనారాయణ, హౌ.నం.4-36, మెయిన్ రోడ్డు, కొండూరు, కలిదిండి కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521333. ... ఎన్‌పిఎ తేది : 23.08.2024	రూ.72,11,969/-	కృష్ణాజిల్లా, కైకలూరు ఉపజిల్లా, కలిదిండి, కొండూరు గ్రామ పంచాయతీ ఏరియా, కొండూరు గ్రామం వద్ద తేది : 30.11.2009న కైకలూరు ఎస్ఆర్ఓ వద్ద శ్రీ.బొర్ర ఏసుబాబు పేరు మీద ఉన్న సేల్ డాక్.నం.3936/ ... స్వాధీనత తేది: 19-02-2025
2	1. శ్రీ.పిట్ట రాజారెడ్డి, ... ఎన్‌పిఎ తేది : 31.10.2024	రూ.44,24,572/-	గుంటూరు జిల్లా, ... స్వాధీనత తేది : 18.02.2025

తేది : 21.02.2025 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ — యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

ప్రజాపక్షపాతి అయితే అసెంబ్లీకి రావాలి

- జగన్‌కు మంత్రి సవిత సవాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాపక్షపాతి అయితే అసెంబ్లీకి రావాలని మంత్రి సవిత సవాల్ విసిరారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చర్చకు అసెంబ్లీకి రావాలని, జగన్‌కు మైక్ ఇచ్చే బాధ్యత తమదేనని, మాట్లాడేందుకు తగు సమయం కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలు, కుంభకోణాలపై చర్చించడానికి సవాల్ విసిరారు. అరాచకవాది వల్లభనేని వంశీని పరామర్శించిన పోలీసులను బెదిరించే విధంగా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని సుజయ్‌కృష్ణ విమర్శించారు. వైసిపిలో ఉన్న 90 శాతం మంది నాయకులు జైళ్లకు వెళ్లడం ఖాయమన్నారు.

మిర్చి రైతులను ముంచిన జగన్: మన్నవ సుబ్బారావు

మిర్చి రైతులను నట్టేట ముంచిన రైతు ద్రోహి జగన్ అని గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు విమర్శించారు. జగన్ పాలనలో మిర్చి యార్డులో జరిగిన అవినీతి, అక్రమాలు, అరాచకాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. దాదాపు రూ.రెండు వేల కోట్లకు పైగా అవినీతి జరిగిందని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

గిల్.. జిగేల్

- సెంచరీతో కదం తొక్కిన శుభ్‌మన్
- మహ్మద్ షమీకి ఐదు వికెట్లు
- ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాపై భారత ఘన విజయం



దుబాయ్: ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారతజట్టు బోణీ కొట్టింది. బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన గ్రూప్-ఎ తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 49.4ఓవర్లలో 228పరుగులకు ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 46.3ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలుత బౌలింగ్‌లో పేసర్ మహ్మద్ షమీ(5/53) రాణించగా.. అనంతరం బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్(101నాటౌట్) శతకంతో మెరిసి టీమిండియా గెలుపులో కీలక పాత్ర పోషించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. 35పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో హృదయ్(100) శతకానికి తోడు, జాకిర్ అలీ(68) అర్ధసెంచరీతో రాణించారు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో సెంచరీ చేసిన తొమ్మిదో బ్యాటర్‌గా హృదయ్ నిలిచాడు. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ ఐదు వికెట్లు తీసి బంగ్లాదేశ్ పతనాన్ని శాసించాడు. హర్షిత్ రాణా మూడు వికెట్లు, అక్షర్ పటేల్ రెండు వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో షమీ వన్డేల్లో 200 వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. లోయర్ ఆర్డర్‌లో హొస్సైన్(18) రాణించాడు. దీంతో బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. షమీకి ఐదు, హర్షిత్‌కు మూడు, అక్షర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శుభ్‌మన్ గిల్‌కు దక్కింది.

అక్షర్ హ్యాట్రిక్ మిస్..

టీమిండియా స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు హ్యాట్రిక్ మిస్ అయింది. తొమ్మిదో ఓవర్‌లో వరుస బంతుల్లో తంజిద్, ముష్ఫికర్లను అక్షర్ పటేల్ అవుట్ చేశాడు. ఆ తర్వాత బంతికి కూడా వికెట్ మిస్ కావడంతో హ్యాట్రిక్ కోల్పోయాడు. రోహిత్ శర్మ చేతిలో పడిన క్యాచ్‌ను జారవిడవడంతో, అతనికి క్యాచ్‌ను వదిలేసినందుకు అక్షర్ పటేల్‌కు క్షమాపణలు చెబుతున్నట్లుగా సైగ చేశాడు.

తౌహిద్ సెంచరీ

తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను తౌహిద్ హృదయ్ సెంచరీతో ఆదుకున్నాడు. 35పరుగులకే 5వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ బంగ్లాదేశ్‌ను తౌహిద్(100), జాకిర్ అలీ(68) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ 6వ వికెట్‌కు ఏకంగా 154పరుగులు జతచేశారు. వీరిద్దరూ ఔటయ్యాక బంగ్లాదేశ్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఎవ్వరూ బ్యాటింగ్‌లో రాణించలేదు. దీంతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 49.4ఓవర్లలో 228పరుగులకు కుప్పకూలింది.

స్కోర్‌బోర్డు...

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ హసన్ (సి)రాహుల్ (బి)అక్షర్ 25, సౌమ్య సర్కార్ (సి)రాహుల్ (బి)షమీ 0, శాంటో (సి)కోహ్లి (బి)హర్షిత్ 0, మెహిదీ హసన్ (సి)శుభ్‌మన్ (బి)షమీ 5, తౌహిద్ హృదయ్ (సి)షమీ (బి)హర్షిత్ 100, ముష్ఫికర్ (సి)రాహుల్ (బి)అక్షర్ 0, జాకిర్ అలీ (సి)కోహ్లి (బి)షమీ 68, రిషాద్ హొస్సైన్ (సి)హార్దిక్ (బి)హర్షిత్ 18, తంజిమ్ (బి)షమీ 0, తస్కిన్ అహ్మద్ (సి)శ్రేయస్ (బి)షమీ 3, ముస్తాఫిజుర్ (నాటౌట్) 0, అదనం 9. (49.4ఓవర్లలో ఆలౌట్) 228పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/2, 3/26, 4/35, 5/35, 6/189, 7/214, 8/215, 9/228, 10/228 **బౌలింగ్:** షమీ 10-0-53-5, హర్షిత్ 7.4-0-31-3, అక్షర్ 9-1-43-2, హార్దిక్ 4-0-20-0, జడేజా 9-0-37-0, కుల్దీప్ 10-0-43-0

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి)రిషాద్ హొస్సైన్ (బి)తస్కిన్ అహ్మద్ 41, శుభ్‌మన్ (నాటౌట్) 101, కోహ్లి (సి)సౌమ్య సర్కార్ (బి)రిషాద్ హొస్సైన్ 22, శ్రేయస్ అయ్యర్ (సి)శాంటో (బి)ముస్తాఫిజుర్ 15, అక్షర్ పటేల్ (సి అండ్ బి)రిషాద్ హొస్సైన్ 8, కెఎల్ రాహుల్ (నాటౌట్) 41, అదనం 3. (46.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 231పరుగులు.

వికెట్ల పతనం: 1/69, 2/112, 3/133, 4/144

బౌలింగ్: తస్కిన్ 9-0-36-1, ముస్తాఫిజుర్ 9-0-62-1, తంజిమ్ 8.3-0-58-0, మెహిదీ 10-0-37-0, రిషాద్ హొస్సైన్ 10-0-38-2.

షమీ రికార్డు

భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ఒక రికార్డును నెలకొల్పాడు. బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్లతో రాణించిన షమీ.. ఛాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్లలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డుపుటల్లో కెక్కాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ ఇప్పటి వరకు 60 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో జహీర్ ఖాన్ (59వికెట్లు) రికార్డును బ్రేక్ చేశాడు. వీరిద్దరి తర్వాత జవగళ్ శ్రీనాథ్ (47), రవీంద్ర జడేజా (43)ఉన్నారు. అలాగే వన్డేల్లో షమీ అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. స్టార్క్ (102 వన్డేల్లో) 200 వికెట్ల మార్క్‌ను సాధించగా.. షమీ (104) రెండో స్థానంలో ఉన్నాడు.

వన్డేల్లో వేగంగా 200వికెట్లు పడగొట్టిన బౌలర్లు...

టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ వన్డేల్లో భారత్ తరఫున వేగంగా 200 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. ఆసీస్ పేసర్ స్టార్క్(102 ఇన్నింగ్స్) టాప్‌లో ఉండగా.. షమీ 103 ఇన్నింగ్స్‌లో 200 వికెట్ల మార్క్ అందుకున్నాడు.

1. మిఛెల్ స్టార్క్(ఆస్ట్రేలియా) : 102 ఇన్నింగ్స్
2. మహ్మద్ షమీ(భారత్) : 103 ఇన్నింగ్స్
3. సక్లయిన్ ముస్తాక్(పాకిస్తాన్) : 104 ఇన్నింగ్స్
4. ట్రెంట్ బౌల్ట్(న్యూజిలాండ్) : 107 ఇన్నింగ్స్
5. బ్రెట్ లీ(ఆస్ట్రేలియా) : 112 ఇన్నింగ్స్

ఫకర్ జమాన్ ఔట్..

కరాచీ: ఛాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్తాన్ జట్టుకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్, ఓపెనర్ ఫకర్ జమాన్ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ ఫకర్ జమాన్ గాయపడ్డాడు. న్యూజిలాండ్‌పై బ్యాటింగ్‌కు దిగిన ఫకర్ 24పరుగులు చేశాడు. మ్యాచ్ అనంతరం అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వెన్నుపూసకు గాయమైనట్లు, రెండువారాలు విశ్రాంతి అవసరమైన డాక్టర్లు తెలిపారు. దీంతో ఫకర్ జమాన్ స్థానంలో ఇమామ్-ఉల్-హక్‌ను పాకిస్తాన్ బోర్డు రిప్లేస్ చేసింది.

ఛాంపియన్స్ ట్రోఫీలో నేడు...
ఆఫ్ఘనిస్తాన్ × దక్షిణాఫ్రికా
(వేదిక: కరాచీ; మ.2.30గం॥లకు)

గ్రూప్-2 స్టేకు హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి- అమరావతి

గ్రూప్-2 మెయిన్ పరీక్ష నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పరీక్షలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. షెడ్యూల్ ప్రకారం ప్రధాన పరీక్ష జరపాలని, లేకపోతే అర్హులైన అభ్యర్థులందరి ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. మెయిన్ పరీక్షకు 92,250 మంది అర్హత సాధించారని, అందులో ఇద్దరు హారిజాంటల్ రిజర్వేషన్‌ను సవాల్ చేస్తున్నారని, ఇద్దరి కోసం వేల మంది అభ్యర్థులకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొంది. నోటిఫికేషను అనుగుణంగా చేపట్టే తదుపరి చర్యలన్నీ తుది తీర్పుకు లోబడి ఉంటాయని షరతు విధించింది. పూర్తి వివరాలతో పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో దివ్యాంగులు, మహిళలు, ఎక్స్ సర్వీస్, క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్య సహా నలుగురు, రోస్టర్‌ను ఖరారు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ విశాఖకు చెందిన ఎం. పార్థసారథి వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు.

లూటీ చేసిన ఆయుధాలను 7 రోజుల్లోగా అప్పగించండి

- మణిపూర్ గవర్నర్ విజ్ఞప్తి

ఇంఫాల్: భద్రతదళాల నుంచి లూటీ చేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని గ్రూపులకు మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా గురువారం విజ్ఞప్తి చేశారు. తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాదాపు రెండేళ్లుగా హింసాకాండ కొనసాగుతున్న మణిపూర్‌లో కేంద్రం ఇటీవల రాష్ట్రపతి పాలన విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మణిపూర్‌లో శాంతి పునరుద్ధరించే లక్ష్యంతో గవర్నర్ అజయ్ భల్లా ఈ ప్రకటన విడుదల చేశారు. "శాంతి, మత సామరస్యతను దెబ్బతీసే దురదృష్టకర ఘటనలతో మణిపూర్‌లోని లోయ, కొండ ప్రాంతాల్లోని ప్రజలు 20 నెలలకు పైగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ సాధారణ స్థితిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలను కొనసాగించేం దుకు వీలుగా అన్ని గ్రూపులు వైరాన్ని వీడి శాంతిభద్రతలను కాపాడుకొనేందుకు ముందుకు రావాలి. మరీ ముఖ్యంగా యువత అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్/అవుట్ పోస్టు/ భద్రతా దళాల క్యాంపుల్లో సరెండర్ చేయాలి. నిర్ణీత సమయంలోగా ఆయుధాలను తిరిగి ఇస్తే ఎలాంటి శిక్షార్హమైన చర్యలు ఉండవు. లేదంటే కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితికి శాంతి యుతమైన పరిష్కారం కోసం, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉజ్వల భవిష్యత్తు కోసం అందరం కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మి ంచుకుం దాం.. ముందుకు రండి. శాంతి మార్గాన్ని ఎంచుకోండి" ప్రకటనలో గవర్నర్ పేర్కొన్నారు.

లోక్‌పాల్ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ : హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకరమంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై దాఖలైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారిస్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీచేసింది. ఈనేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టి.. స్టే విధించింది. అలాగే సదరు హైకోర్టు న్యాయమూర్తి పేరును బయటకు వెల్లడించొద్దని ఫిర్యాదుదారుడిని ఆదేశించింది.

అమెరికా నుండి పనామాకు 299మంది వలసదారులు

- భారతీయులు సురక్షితంగా వున్నారన్న పనామా

పనామా సిటీ : అమెరికా ప్రభుత్వం మొత్తంగా 299మంది మైగ్రేంట్లను పనామాకు పంపించింది. అందులో భారతీయుల బృందం కూడా వుంది. భారతీయులందరూ సురక్షితంగా ఇక్కడకు చేరుకున్నారని పనామా భారత్‌కు తెలియచేసింది. వారికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం, అక్కడి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. భారతీయులు గురువారం పనామా చేరుకున్న విషయాన్ని ఎక్స్‌లో పోస్టు చేసింది. అయితే ఎంతమంది భారతీయులు వచ్చారన్న సమాచారం పంచుకోలేదు. వీరిలో ఎక్కువమంది పంజాబ్, హర్యానా, గుజరాత్‌లకు చెందినవారున్నారు. మూడు విమానాల్లో వీరందరినీ అమెరికా నుండి ఇక్కడకు తీసుకువచ్చారు. సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్న 299మందిలో కేవలం 171 మంది మాత్రమే వారి స్వంత దేశాలకు వెళ్ళేందుకు అంగీకరించారు. వారి దేశాలకు స్వచ్ఛందంగా పంపించడానికి తిరస్కరించిన 98మందిని పనామాలోని డేరియన్ ప్రావిన్స్‌లోని శిబిరానికి తరలించారు. అమెరికా తరలించిన వారిని ఆయా దేశాలకు పంపించే ప్రక్రియలో పనామా అనుసంధాన దేశంగా వ్యవహరించడానికి గత వారం పనామా అధ్యక్షుడు జోస్ రాల్ ములినో అంగీకరించారు. కోస్టారికా కూడా ఇందుకు అంగీకారం తెలిపింది. అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వారందరినీ వారి దేశాలకు పంపివేస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు చర్యలు తీసుకుంటోంది. వారు సురక్షితంగా అన్ని సదుపాయాలు వున్న హోటల్‌లో బస చేశారని, వారికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పనామా, నికారాగ్వా, కోస్టారికాలకు భారత ఎంబసీ కార్యాలయం ఎక్స్ పోస్టులో తెలిపింది.

క్రిమినల్ కేసులో విచారణకు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్

సియోల్ : క్రిమినల్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబరులో దేశంలో కొద్ది గంటల పాటు సైనిక పాలన విధించి తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న క్రిమినల్ అభియోగాలతో అరెస్టు చేయడంపై యూన్ తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. సియోల్ సెంట్రల్ జిల్లా కోర్టులో జరుగుతున్న విచారణకు అధ్యక్షుడు రావడంతో ఆ ప్రాంతమంతా గట్టి బందోబస్తు చేశారు. ఆయన మద్దతుదారులు వందల సంఖ్యలో ర్యాలీలు నిర్వహించారు. క్రిమినల్ కేసులో ఇలా విచారణను ఎదుర్కొంటున్న మొదటి సిట్టింగ్ అధ్యక్షుడు యూన్. ముందుగా సాక్షులను విచారించిన తర్వాత యూన్ తరపు న్యాయవాదులు ఆయన అరెస్టును రద్దు చేసి కస్టడీ నుండి విడుదల చేయాల్సిందిగా కోరుతూ చేసిన అభ్యర్థనను కోర్టు పరిశీలించనుంది. డిసెంబరు 14ను అధ్యక్షుడిని అభిశంసించిన తర్వాత ఆయన అధ్యక్ష అధికారాలను రద్దు చేశారు. ఇప్పుడు ఆయనను లాంఛనంగా పదవి నుండి తొలగించాలా లేక పార్లమెంట్ అభిశంసనను రద్దు చేసి, తిరిగి అధ్యక్ష పీఠంపై అధిష్టించాలా అని రాజ్యాంగ న్యాయస్థానం యోచిస్తోంది.

అంతా అదానీ కోసమే..

- ఏ దేశంతో చర్చించినా ఆ సంస్థ ప్రయోజనాలే మోడీకి ముఖ్యం
- ఇటీవల కతార్ అమీర్ భారత పర్యటనలోనూ ఇదే సుస్పష్టం
- అంతకు ముందే ఖతార్ కంపెనీతో జాయింట్ వెంచర్‌పై సంతకం



న్యూఢిల్లీ : మోడీ కార్పొరేటు మిత్ర బృందంలో అదానీది ప్రత్యేక స్థానం. ప్రధాని హోదాలోలో మోడీ.. అదానీకి ప్రయోజనం చేకూర్చే విధంగానే వ్యవహరిస్తారన్నది బహిరంగ రహస్యం. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఏ దేశానికి వెళ్లినా, ఒక దేశానికి చెందిన అధినేత భారత్‌కు వచ్చినా.. అదానీకి ప్రయోజనం చేకూర్చే అవకాశం కనిపిస్తే చాలు.. ప్రధాని స్థాయిలో మోడీ పనులు చక్కబెడుతుంటారని చెప్తుంటారు. ఇప్పుడు ఖతార్ రాజు పర్యటనలోనూ ఇవే పరిస్థితులు కనిపించాయంటున్నారు విశ్లేషకులు. గత కొంత కాలంగా అంతర్జాతీయంగా అదానీకి గడ్డు పరిస్థితులే ఎదురయ్యాయి. అయినా కూడా మోడీ ప్రభుత్వం అదానీ గ్రూపునకు అనుకూలంగానే వ్యవహరిస్తున్నది. ఖతార్ అమిర్(రాజు) తమీమ్ బిన్ హామద్ థాని భారత్ పర్యటనల విషయంలోనూ ఇది స్పష్టమైంది. నిజానికి అమీర్ భారత పర్యటనకు రావటానికి కొన్ని రోజుల ముందు అదానీ కంపెనీ, ఖతార్ కంపెనీ గల్ఫ్ ప్రాంతంలో సముద్ర కార్యకలాపాలలో గౌతమ్ అదానీకి లబ్ధి చేకూరేలా జాయింట్ వెంచర్‌పై సంతకం చేశాయి. మోడీ అండతోనే ఖతార్ ఎమిర్ పర్యటనకు ముందు ఈ డీల్ జరిగిందని పలువురు విశ్లేషిస్తున్నారు.

అదానీ హార్బర్ సర్వీసెస్.. సీ హారిజన్ ఆఫ్‌షోర్ మెరైన్ సర్వీసెస్, ఖతార్‌లో జమాల్ ఎ రబ్ ఎఎం అల్ యాఫీ అనే వ్యక్తితో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ జాయింట్ వెంచర్ పేరు అల్ అన్నాబి మెరైన్ సర్వీసెస్. దీనిని ఫిబ్రవరి 12న ఎమిర్ భారత పర్యటనకు ఐదు రోజుల ముందు స్థాపించారు. జాయింట్ వెంచర్ కంపెనీ నౌకల కార్యకలాపాలు, నిర్వహణను చేస్తుంది. ఈనెల 17న సాయంత్రం ఎమిర్ భారత్‌కు వచ్చినపుడు ప్రధాని మోడీ.. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి మరీ ఆయనను ఆహ్వానించటానికి స్వయంగా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లటం గమనార్హం. ఒక దేశాధినేత మనదేశంలో పర్యటిస్తున్నపుడు భారత ప్రధాని ఇలా వ్యవహరించటం చాలా అరుదు. గతంలో అమెరికా అధ్యక్షులుగా ఉన్నపుడు ఒబామా, డోనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబే, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లు భారత్‌కు వచ్చినపుడు మోడీ ఈ విధంగా వ్యవహరించారు. ప్రధాని మోడీ తీరు వివాదంగా మారుతున్నది. ఈ నేపథ్యంలోనే ఖతార్ కంపెనీతో అదానీ డీల్ విషయం చర్చనీయాంశంగా మారింది. ఆయన పర్యటనకు కొన్ని రోజుల ముందే ఇది జరగటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. గతంలోనూ ద్వైపాక్షిక పర్యటనలలో భాగంగా ప్రధాని మోడీ ఏ దేశానికి వెళ్లినా.. అదానీ వ్యాపార ఒప్పందాలు ఈ విధంగానే కుదిరాయన్న విషయాన్ని పలువురు విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి గ్రీస్ వరకు, శ్రీలంక నుంచి ఇజ్రాయిల్ వరకు.. ప్రధాని మోడీ ద్వైపాక్షిక పర్యటనలకు వెళ్లిన ప్రతి చోటా అదానీకి ప్రయోజనం చేకూర్చే అంశాలుంటాయని చెప్తున్నారు. గుజరాత్‌లోని భారత్-పాక్ సరిహద్దుకు దగ్గరగా సోలార్ ఫామ్‌ను అభివృద్ధి చేయటానికి అదానీని అనుమతించేందుకు ప్రభుత్వం సరిహద్దు భద్రతా నియమాలను సడలించిందని ఇటీవల బయటపడింది.

చేనేత మార్కెటింగ్‌కు తమిళనాడుతో ఎంఒయు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తయారవుతున్న చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెటింగ్ కల్పించాలని తమిళనాడు ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకోనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎంఒయులో భాగంగా రాష్ట్రానికి ఆప్కోను, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తమ ఉత్పత్తులను కలిపి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆప్కో షోరూమ్‌లలో కో ఆప్టెక్స్ ఉత్పత్తులను, కో ఆప్టెక్స్ షో రూమ్‌లలో ఆప్కో ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అవకాశం లభిస్తోందన్నారు. దీంతో రెండు సంస్థలకు సంబంధించిన చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

ఎవరినో గెలిపించేందుకు బైడెన్ ప్రయత్నం

- భారత్‌కు ఆర్థిక సాయంపై ట్రంప్ వ్యాఖ్యలు
- అలాంటి సాయం చేయాల్సిన అవసరమేంటని ప్రశ్న



న్యూయార్క్ : 'ఓటర్ టర్నవుట్' కోసం భారత్‌కు 21 మిలియన్ల డాలర్లను కేటాయించాలని గత బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశ్నించారు. 'బహుశా మరెవరినో గెలిపించేందుకు వారు ప్రయత్నించినట్లు వుంది.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మియామిలో ఎఫ్ఐఐ ప్రాధాన్యతా సదస్సులో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ట్రంప్ అంశంపై ఆందోళనలు వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక సాయం భారత్‌కు చేయాల్సిన అవసర మేంటని ప్రశ్నించారు. భారత ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అమెరికా సాయం చేయాల్సిన అవసరాన్ని ఆయన బుధవారం కూడా ప్రశ్నించారు. భారత్‌లో ఓటర్ల శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు యుఎస్ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లను అందచేసిందని ఎలన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం వెల్లడించింది. ఆ నేపథ్యంలో ట్రంప్ పై విధంగా స్పందించారు. ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, తాను అధ్యక్షుడిని కాకముందు ప్రజల డబ్బు అంతా ఎక్కడకు పోతోందో కొన్ని ఉదాహరణలు వివరించారు. "21 మిలియన్ల డాలర్లు భారత్‌కు వెళ్ళాయి. అసలు భారత్‌లో మనం ఇంత మొత్తం ఖర్చు పెట్టాల్సిన అవసరమేముంది? బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులను బలోపేతం చేసేందుకు 29 మిలియన్ల డాలర్లు అందచేశారు. ..నేపాల్‌లో జీవ వైవిధ్య పరిక్షణ కోసం 10మిలియన్ల డాలర్లు ఇచ్చారు. ఆసియా దేశాల పరిస్థితి బాగానే వుంది. వారికి మనం డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు." అని ట్రంప్ పేర్కొన్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని, ఇలాంటి జాబితా సుదీర్ఘంగా వుందన్నారు. ఏఏ అంశాలపై అమెరికా పన్నుదారుల డబ్బు ఖర్చు చేస్తున్నారో వివరిస్తూ ఫిబ్రవరి 16న డోజ్ ఒక జాబితా ఇచ్చింది. అందులో భారత్‌కు ఇచ్చిన మొత్తం గురించి వుంది. ఆ జాబితాలోని అంశాలన్నింటినీ రద్దు చేసామని డోజ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యుఎస్ఎయిడ్ చేపట్టే మానవతా సాయాన్ని నిలిపివేస్తూ ఈ నెల 7న డోజ్ ఆదేశాలు జారీ చేసింది.

దేశ ప్రజల డిమాండ్లకు పూర్తి తిరస్కరణ

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్షాలు ఆందోళనలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజల డిమాండ్లను పూర్తిగా తిరస్కరించిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ విమర్శించారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ-ఎంఎల్, ఆర్ఎస్‌పి, సిజిపిఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో ప్లకార్డులు చేబూని కార్మిక, రైతు, విద్యార్థి, పేదలకు వ్యతిరేక కేంద్ర బడ్జెట్ అంటూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాల హెూరెత్తించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కేంద్రం తన బడ్జెట్‌లో ఉపాధి కూలీలు, రైతులు వంటి వారిని పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. సబ్సిడీలకు కోత విధించారని, మరోవైపు కార్పొరేట్లకు రాయితీలు ప్రకటించారని విమర్శించారు.



బడ్జెట్ దేశ ప్రజల అవసరాలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. నిరుద్యోగం, తగ్గుతున్న వేతనాలకు కారణమయ్యే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, మోడీ ప్రభుత్వం ఎక్కువ ఆదాయం కలిగిన వారికి పన్నులను తగ్గించిందన్నారు. అదే సమయంలో ప్రజలకు చేయాల్సిన ఖర్చును తగ్గిస్తోందని విమర్శించారు. దేశంలోని కార్పొరేట్ వర్గం మినహాయిస్తే, అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ తిరస్కరించిందని అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి దినేష్ వర్ష్నే, రామకృష్ణ పాండే (సిపిఐ), రవి రాయ్ (సిపిఐ ఎంఎల్), మన్వేంద్ర ప్రతాప్ సింగ్ (ఆర్ఎస్‌పి), బిర్జున్ నాయక్ (సిజిపిఐ) తదితరులు పాల్గొని ప్రశంసించారు.

గంట గంటకూ మోత

(మొదటిపేజీ తరువాయి)

అనుమతి ఇచ్చింది. దీనిప్రకారం స్వల్ప లోడ్(ఎల్‌టి) పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు కూడా ఈ పద్ధతిలో నూతన ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఆరు నుంచి పది గంటల వరకు పీక్ అవర్‌గా ఉంటుంది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, రాత్రి 12 నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఆఫ్‌పీక్ అవర్‌గా ఉంటుంది.

మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు, రాత్రి పది నుంచి 12 గంటల వరకు సాధారణ అవర్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఎల్‌టి వినియోగదారుల నుంచి 50 యూనిట్లలోపు వినియోగించే వారికి యూనిట్‌కు రూ.5.40లు, 51-100 యూనిట్లలోపు రూ.7.65, 101-300లోపు రూ.9.05, 301-500 మధ్య యూనిట్‌కు రూ.9.60, ఆపైన వినియోగించే వారికి రూ.10.15ల చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి.

'స్మార్ట్' తప్పనిసరి...!

'వినియోగదారులు ఏ సమయంలో ఎంత విద్యుత్ వినియోగించారని తెలుసుకోవాలంటే స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు తప్పనిసరి కానున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు ఈ ప్రిపెయిడ్ మీటర్లు అమర్చే కాంట్రాక్ట్‌ను అదానీ కంపెనీ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ రాష్ట్రంలో 59,21,344 మీటర్లను వినియోగదారులకు బిగించనుంది. ఇప్పటికే అధిక విద్యుత్ వినియోగించే పరిశ్రమలతో పాటు చిన్న వ్యాపారస్తులకు కూడా ప్రిపెయిడ్ మీటర్లను డిస్కంలు బిగిస్తోన్నాయి. అదానీ మీటర్ల కోసమే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని విద్యుత్ సంస్థలు అమలు చేస్తున్నాయని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్నారు. టిఒడి విధానం వల్ల వినియోగదారులపై అధిక భారాలు పడతాయని, ఈ విధానాన్ని అనుమతించొద్దని ఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎంతో పాటు ప్రజాసంఘాలు, పరిశ్రమలు కూడా డిమాండ్ చేశాయి. 2025 ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్, 2026 ఫిబ్రవరి మార్చి నెలలను హైగ్రిడ్ డిమాండ్‌గా పేర్కొంది. 2025 జూన్ నుంచి ఆగస్టు వరకు, నవంబర్ నుంచి జనవరి వరకు లోగ్రిడ్ డిమాండ్‌గా విభజించింది.

175 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్

(మొదటిపేజీ తరువాయి)

కె.శశిధర్ మాట్లాడుతూ... ఇంటర్మీడియట్, ఎపి ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వయోజన విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ... పరీక్షా కేంద్రాల వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచడం, ప్రశ్నా పత్రాలు పోలీసు స్టేషన్‌లో సేఫ్ కస్టడీ ఉంచి ఆయా పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, సిపిలు, డిఇఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిర్చి రైతును ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం అవుతానని, ఏ విధంగా ఈ సమస్యను పరిష్కరించాలో ఆలోచిస్తామని తెలిపారు.

సజావుగా పోలవరం పనులు

జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జల్ జీవన్ మిషన్, పోలవరంపై సమీక్షించారు. పోలవరం పనులు సజావుగా జరుగుతున్నాయన్నాని చంద్రబాబు అన్నారు. పోలవరం ఫేజ్-1ను 2027 చివరి నాటికి పోలవరం పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నదుల అనుసంధానంపై కూడా చర్చించామని, మిగులు జలాలు సముద్రంలోకి పోకుండా వినియోగించుకుంటే, కరువు లేకుండా చేయడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్‌ను దేశమంతా చాలా బాగా ఉపయోగించుకున్నారని, అయితే రాష్ట్రంలో గత ప్రభుత్వం ఒక్క శాతం కూడా ఉపయోగించుకోలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో గోదావరి మిగులు జలాలు ఉన్నాయని, ఆ నీటిని రెండు రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయని అన్నారు. అయితే కృష్ణా జలాల్లో మాత్రం సమస్య ఉందని, ప్రాజెక్టుల కింద ఉన్న నీటిని రెండు రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయని, అయితే సముద్రంలోకి పోయే నీటిని తాము ఉపయోగించుకుంటామని అన్నారు. అందులో రాజకీయాలేవీ లేవని, రాజకీయం చేయడం తగదని పేర్కొన్నారు.

వైఎస్ జగన్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు

రాజకీయాలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేయాలని, ఏపిలో టిడిపి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని చెప్పారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అన్నారు. 'ఎన్నికల సంఘం చెప్పిన తరువాత ఎలా వెళ్తారు? ఎన్నికల సంఘం కంటే మీ రాజకీయ పార్టీ గొప్పదా?' అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ టిడిపి, ఎన్‌డిఎది కాదని, స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని అన్నారు.

ఎన్‌డిఎ నేతల భేటీ

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఎన్‌డిఎ నేతల సమావేశంలోనూ, బిజెపి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందులోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో చర్చించినట్లు చంద్రబాబు తెలిపారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గతంలో ఎన్‌డిఎ సమావేశాలకు హాజరుకాలేదన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పితో తాను బాధపడుతున్నానని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, అన్ని హామీలు అమలుచేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

చీటింగ్ కేసులో మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు శిక్ష

ముంబయి : సుమారు 30 ఏళ్ల క్రితం నాటి చీటింగ్ కేసులో మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, ఎన్‌సిపి నాయకులు మాణిక్‌రావు కొకాటేకు నాసిక్‌లోని కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడు సునీల్ కోకాటే జైలు శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధించిస్తూ తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి టీఎస్ డిఘూలే 1995లో ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు.. కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి గురువారం శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను నిర్దోషిగా కోర్టు ప్రకటించింది.

మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్ రావు మాట్లాడుతూ.. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరైందని తెలిపారు. ఈ తీర్పుపై హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్తానని చెప్పారు. అయితే హైకోర్టు నుంచి ఉపశమనం లభించకపోతే మాణిక్‌రావ్ కోకాటే శాసనసభా సభ్యత్వంపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది.

నైతిక విలువలు పాటించండి

- ఓటిటిలకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ : ఐటీ రూల్స్‌లోని (2021) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఓటిటిలు, సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా పాటించాలని కేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు అందాయి. ఐటీ రూల్స్‌లోని (2021) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను సామాజిక మాధ్యమాలు, ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను ప్రసారం చేయకూడదు. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలి. స్వీయ నియంత్రణ కలిగిన ఓటీటీలు నైతిక విలువలను పాటించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

ఇటీవల 'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ హెచ్చరిక చేసింది.

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

గేట్ పాసులు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన వారంతా స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్ నుంచి అడ్మిన్ బిల్డింగ్ వరకూ గురువారం భారీ ర్యాలీ, అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులకు సమ్మె నోటీసు అందజేశారు. సభలో కార్మికులను ఉద్దేశించి సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తోన్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రైవేటీకరణలో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. ప్రైవేట్ కంపెనీలకు ప్లాంట్‌ను అప్పగించాలంటే కార్మికులకయ్యే ఖర్చును తొలుత తగ్గించాలని, అందులో భాగంగా ఇప్పటికే పర్మినెంట్ కార్మికులకు విఆర్ఎస్ ఇచ్చి పంపించేందుకు చూస్తున్నారని తెలిపారు. కార్మికులు సాధించుకున్న పిఎఫ్, ఇఎస్ఐ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ తదితర ఆర్థిక ప్రయోజనాలకు గండి కొట్టడానికి కుట్ర జరుగుతోందన్నారు. 1995లో పోరాడి సాధించుకున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయటానికి కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యపోరాటాలతో వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు ఇప్పటి వరకూ ఉద్యోగ భద్రత ఉందన్నారు. కాంట్రాక్టర్ మారినా కార్మికులను కొనసాగించే పద్ధతి ఇక్కడ ఉందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం వెలువడిన తర్వాత చాపకింద నీరులా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ వస్తున్నారన్నారు. 2,400 మందిని త్వరలో తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని, దీన్ని ఉద్యమాలతో అడ్డుకుంటామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశం నుంచి ఉక్కు యాజమాన్యం వెనక్కు తగ్గకుంటే మార్చి 7 తర్వాత ఏ క్షణమైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, ఎఐటియుసి నాయకులు మంత్రి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకం, కార్పొరేట్ అనుకూలం

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు కేంద్రాన్ని నిలదీయడం లేదని ప్రశ్నించారు. విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన కడప ఉక్కు కర్మాగారాన్ని ఇంతవరకూ ఇవ్వకపోవడం రాష్ట్రాన్ని మోసగించడమేనన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో పేదరిక నిర్మూలన అంశాన్ని విస్మరించారని తెలిపారు. బ్యాంకులకు కార్పొరేట్ కంపెనీలు ఉన్న అప్పులను మాఫీ చేశారని, తిరిగి బ్యాంకులు కార్పొరేట్లకు అప్పులు ఇచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకుందని వివరించారు. నిత్యావసరాల ధరలతో పాటు అన్నింటి ధరలూ పెరిగాయన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ఎన్నికల ప్రయోజనాల దృష్టితో కొన్ని రాష్ట్రాలనే పరిగణనలోకి తీసుకుని రూపొందించినట్టు ఉందని తెలిపారు. ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంపైడిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, బి.పద్మ, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు, కెఎం.శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, కె.క్షేత్రపాల్ రెడ్డి, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధర్నాలు, కళ్లకు గల్లంతలతో నిరసనలు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యాన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగాయి. నెల్లూరులో ర్యాలీ, ధర్నా, నెల్లూరు జిల్లా ఆత్మకూరు, ఎఎస్‌పేట, బుచ్చిరెడ్డిపాళెం, కందుకూరు, గుడ్లూరు, కోవూరులో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల జిల్లా డోన్‌లో ధర్నా చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, నల్లమాడ, సోమందేపల్లి, గోరంట్ల తదితర మండలాల్లో నిరసన తెలిపారు. పెనుకొండ, సోమందేపల్లి, పెనుకొండలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ధర్మవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కడపలో వామపక్షాల ఆధ్వర్యాన సదస్సు' నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జిల్లా అట్లూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బద్వేలు, ఖాజీపేట మండలాల్లో నిరసన తెలిపారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద, గూడూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన, ఏర్పేడులో కెవిపిఎస్, సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా పరవాడలో సిఐటియు ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

థర్మల్ ప్లాంట్ కోసం1944 ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

17.74 ఎకరాలను సేకరిస్తున్నారు. సరుబుజ్జిలి మండలం శ్రీరామవలస గిరిజన గ్రామంలో 75.95 ఎకరాలు, వెన్నెలవలసలో 349.74 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు.

ఆగిన క్రయవిక్రయాలు

బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతాల్లో పవర్ ప్లాంట్ వస్తుందన్న ప్రచారంతో అక్కడ భూముల క్రయవిక్రయాలు ఆగిపోయాయి. అప్పులు, శుభకార్యాల కోసం భూములు అమ్ముకునేందుకు కొందరు రైతులు ప్రయత్నిస్తున్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు పొలాల్లో మట్టి వేసి ఎత్తు చేసుకునే పనులనూ రైతులు ఆపేశారు.

పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68